SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 289 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 9 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

# తాతా మధు, నవీన్‌పై సస్పెన్షన్ వేటు




- సెషన్ మొత్తానికి మండలి నుంచి సస్పెన్షన్
- ఇద్దరిపై చర్యలకు తీర్మానం ఆమోదం
- మూజువాణి ఓటుతో నిర్ణయం
- కోర్టు నుంచి విడుదలై సభకు రాగానే చర్య
- సస్పెన్షన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీల ఆందోళన

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలంటూ మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. అనంతరం చైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించడంతో ఇద్దరు ఎమ్మెల్సీలను ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

మిగతా 2 లో



# ఎర్రవల్లిలో హైటెన్షన్



## కేసీఆర్ హత్యకు కుట్ర.. భద్రత కల్పించాలి

- కేసీఆర్ రక్షణ ప్రభుత్వ బాధ్యత: కేటీఆర్
- పోలీసులపై నమ్మకం లేదంటూ వ్యాఖ్యలు
- ఎర్రవల్లి వెళ్తున్న కేటీఆర్, హరీశ్ అరెస్ట్
- కాంగ్రెస్ శ్రేణులను ఎందుకు అడ్డుకోలేదని నిలదీత
- బోయిన్‌పల్లి పీఎస్ వద్ద బీఆర్ఎస్-కాంగ్రెస్ ఘర్షణ

3

- కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి యత్నం
- డప్పుల మోతతో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు
- అరకిలోమీటరు దూరంలోనే అడ్డుకున్న పోలీసులు
- బారికేడ్లు దాటే యత్నం.. తోపులాట
- ఎర్రవల్లి బయలుదేరిన కేటీఆర్, హరీశ్ అరెస్ట్
- రెండున్నర గంటలపాటు తీవ్ర ఉద్రిక్తత

శాసనసభ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ దళిత విభాగం, దళిత సంఘాలు ఇచ్చిన పిలుపుతో సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసరాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. వెయ్యి మంది డప్పు కళాకారులతో ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు కాంగ్రెస్ శ్రేణులు వేలాదిగా తరలిరావడంతో పోలీసులు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. నిరసనకారులు బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగి పలువురు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి.

**ఎర్రవల్లి, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. శాసనమండలిలో స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఇచ్చిన పిలుపుతో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్, దళిత సంఘాల నాయకులు డప్పులతో ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడికి తరలివచ్చారు. వారిని పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకోవడంతో పలుచోట్ల తోపులాటలు చోటుచేసుకున్నాయి. సుమారు రెండున్నర గంటలపాటు ఫామ్‌హౌస్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. కాంగ్రెస్ నేతలు వెయ్యి

మిగతా 2 లో

# నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు..



- హరీశ్‌రావుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ ఘాటు బదులు
- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల చర్యలేవని హరీశ్ నిలదీత
- సబిత, సునీత ఘటనలపై సభలో వాడీవేడి చర్చ
- దాడి జరిగితే విచారించి చర్యలు తీసుకుంటామన్న సీతక్క
- పోలీసుల తీరును పరిశీలిస్తామన్న మంత్రి శ్రీధర్‌బాబు

3

మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి ఆరోపణల అంశం తెలంగాణ అసెంబ్లీని కుదిపేసింది. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు సభలో నిలదీశారు. "మా అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్రంగా స్పందిస్తూ.. "అవమానం జరిగింది నీ తల్లికి కాదు.. మా అమ్మకు. ఆవేశం నీకంటే నాకు ఉండాలి" అంటూ ఘాటుగా బదులిచ్చారు.





## బతుకమ్మపై యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్

- యువ ప్రతిభకు సరికొత్త వేదిక
- అధికారిక పోస్టర్ ఆవిష్కరించిన కోమటిరెడ్డి
- షార్ట్ ఫిలింలు.. పాటలు.. సృజనాత్మక వీడియోలకు అవకాశం
- తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటాలని పిలుపు
- యువ దర్శకులు, విద్యార్థులు పాల్గొనాలని సూచన

2

## అంతిమ విజయం సత్యానిదే!

- యువత సత్యమార్గంలోనే నడుస్తోంది
- ప్రజా భాగస్వామ్యంతోనే శాశ్వత మార్పు
- ప్రజాసేవే అధికారానికి పరమార్థం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం
- విమర్శకులకు వడోదర వేదికగా చురకలు
- భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం

4



## ప్రధాని భద్రతలో కలకలం

- మోదీ కార్యక్రమంలో నకిలీ గుర్తింపు కార్డుతో యువకుడు
- వెంట వచ్చిన వ్యక్తి వద్ద తుపాకీ
- ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు

4




## టీచర్ల నియామకాల్లో అర్హతలేనివారికి 'నో ఎంట్రీ'

- సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు నిర్దేశిత అర్హతలు తప్పనిసరి
- విలీనం పేరుతో నిబంధనలు పక్కన పెట్టొద్దు
- విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యమన్న ధర్మాసనం

4

## ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్

ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన నూతన ప్రపంచ పటం భారత్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాల సరిహద్దుల విషయంలో భారత, చైనా దేశాల వాదనలకు అనుగుణంగా వేర్వేరు గీతలను (ఇండియన్ లైన్, చైనీస్ లైన్) చూపించడం వివాదానికి దారితీసింది.




4



# బతుకమ్మపై 'యంగ్ ఫిలిం మేకర్స్' ఛాలెంజ్

**అధికారిక పోస్టర్ ఆవిష్కరించిన కోమటిరెడ్డి**

**షార్ట్ ఫిలింలు.. పాటలు.. సృజనాత్మక వీడియోలకు అవకాశం**

**తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటాలని పిలుపు**

**యువ దర్శకులు, విద్యార్థులు పాల్గొనాలని సూచన**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటడంతో పాటు యువతలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న లిలి'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026'లిలిను యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సచివాలయంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎఫ్‌డీసీ ఎండీ జి.ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్ కొండా, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్‌రెడ్డితో కలిసి ఈ ఛాలెంజ్ అధికారిక పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. షార్ట్ ఫిలింలు, బతుకమ్మ పాటలు, సృజనాత్మక వీడియోల ద్వారా తమ ప్రతిభను నిరూపించుకోవాలనుకునే యువ ఫిలిం మేకర్లకు ఈ ఛాలెంజ్ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. యువ దర్శకులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. బతుకమ్మ విశిష్టతతో పాటు తెలంగాణ సంస్కృతి, జానపద కళలు, ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించేలా సృజనాత్మక చిత్రాలను రూపొందించాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే అంశాలతోనూ షార్ట్ ఫిలింలను రూపొందించవచ్చని తెలిపారు. యువత తమ సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టి బతుకమ్మ గొప్పతనాన్ని వినూత్నంగా ఆవిష్కరించాలని, తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశంగా 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్-2026'ను ఉపయోగించుకోవాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# స్కూల్ బస్సులో అకస్మాత్తుగా మంటలు

**విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన బస్సులో మంగళవారం ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ప్రాథమిక తరగతుల విద్యార్థులు బస్సు ఎక్కుతున్న సమయంలో ఇంజన్ భాగం నుంచి మంటలు వ్యాపించడంతో తీవ్ర కలకలం రేగింది. అప్రమత్తమైన స్కూల్ సిబ్బంది, డ్రైవర్ తక్షణమే స్పందించి పిల్లలను బస్సు నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించడంతో ప్రాణనష్టం తప్పి పెను ప్రమాదం నివారించబడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి, ఆందోళనకు గురయ్యారు. పాఠశాల యాజమాన్యం బస్సుల నిర్వహణ, ఫిట్‌నెస్ నిబంధనలు, భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేసిందని ఆరోపించారు. గతంలోనూ ఇదే స్కూలుకు చెందిన మరొక బస్సు ప్రమాదానికి గురైందని గుర్తుచేస్తూ, పాఠశాలలోని అన్ని వాహనాల కండిషన్‌పై రవాణా శాఖ అధికారులు సమగ్ర తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అత్యవసర ద్వారాలు, అగ్నిమాపక పరికరాల లభ్యతపై విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# నగరంలో మరో భారీ ఫ్లైఓవర్

**బంజారాహిల్స్ నుంచి గచ్చిబౌలికి ఎలివేటెడ్ కారిడార్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** హైదరాబాద్ మహానగరంలో అత్యంత కీలకమైన ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు హెచ్ఎండీఏ ఒక భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ వరకు దాదాపు 9 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ ప్రాజెక్టు కోసం అధికారులు తాజాగా టెండర్లను ఆహ్వానించారు. అంచనా వ్యయం రూ.1,656 కోట్లుగా నిర్ణయించిన ఈ కారిడార్ నిర్మాణానికి అర్హులైన కాంట్రాక్టర్లు ఈ నెల 22వ తేదీ లోపు బిడ్లు దాఖలు చేయాలని సూచించారు. మొత్తం రెండు దశల్లో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టులో తొలి దశ కింద ఫిలింనగర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు 5 కి.మీ, రెండో దశలో కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హకీంపేట్ కుంట వరకు 4 కి.మీ మేర పనులు చేపట్టనున్నారు. ప్రయాణికుల రాకపోకల సౌకర్యార్థం ఫిలింనగర్, నార్నే రోడ్, జూబ్లీహిల్స్, ఐటీసీ కోహినూర్, టీ-హబ్, మైండ్‌స్పేస్ వద్ద 6 ర్యాంప్‌లను అందుబాటులోకి తేవడంతో పాటు భవిష్యత్తు మెట్రో విస్తరణకు అనుగుణంగా డిజైన్ చేశారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రయాణికులకు ట్రాఫిక్ కష్టాలు తొలిగి, నగర నడిబొడ్డు నుంచి ఓఆర్ఆర్ చేరుకోవడం సులభతరం కానుంది.

# ఎర్రవల్లిలో హైటెన్షన్..

మొదటి పేజీ తరువాయి

మంది డప్పు కళాకారులతో ఫామ్‌హౌస్ వద్ద నిరసన చేపట్టేందుకు పిలుపునివ్వడంతో పోలీసులు ముందుగానే అప్రమత్తమయ్యారు. ఎర్రవల్లి వెళ్లే ప్రధాన మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ స్వయంగా ఫామ్‌హౌస్ వద్దకు చేరుకుని భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**అరకిలోమీటరు దూరంలో డప్పుల మోత**

వరదరాజాపూర్ మీదుగా ఫామ్‌హౌస్ సమీపానికి చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సుమారు అరకిలోమీటరు దూరంలోనే డప్పులు మోగిస్తూ నిరసన తెలిపారు. కొందరు నిరసనకారులు బారికేడ్లను తోసుకుని ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని వెనక్కి పంపే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పలువురు పోలీసులకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నర్సారెడ్డి అస్వస్థతకు గురికావడంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

**పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం**

వరదరాజాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీ నిరసనలకు దిగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరుపార్టీల కార్యకర్తలు రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. దామరకుంటలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. దీంతో పామోజు సహా పరిసర ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించారు.

**ఎర్రవల్లి బయలుదేరిన కేటీఆర్, హరీశ్**

కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి కాంగ్రెస్ శ్రేణులు తరలివస్తున్న విషయం తెలియడంతో అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు





పలువురు ఎమ్మెల్యేలు ఎర్రవల్లికి బయలుదేరారు. వారిని తొలుత బొల్లారం వద్ద, అనంతరం హకీంపేట వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. వాహనాలను ముందుకు అనుమతించకపోవడంతో కేటీఆర్, హరీశ్‌రావు కార్లు దిగి పాదయాత్రగా ఎర్రవల్లికి వెళ్లేందుకు ప్రయత్నించారు. కొంతదూరం వెళ్లిన అనంతరం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులను కూడా అదుపులోకి తీసుకున్నారు.

**'కాంగ్రెస్‌కు సహకరిస్తున్నారు'**

కేసీఆర్ ఫామ్‌హౌస్ వైపు కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లేందుకు పోలీసులు సహకరిస్తూ.. తమను మాత్రం అడ్డుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. తమ పార్టీ అధినేతకు రక్షణగా వెళ్లేందుకు ప్రయత్నిస్తే అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అయితే ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులనూ అడ్డుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

**తాతా మధు వ్యాఖ్యలతోనే రగడ**

శాసనమండలిలో స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు భావిస్తున్న వ్యాఖ్యలపై వివాదం చెలరేగిన నేపథ్యంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఈ నిరసనకు పిలుపునిచ్చింది. తాతా మధుపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల సభ్యులు డిమాండ్ చేశారు. మరోవైపు తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావని, అపార్థమైతే వాటిని వెనక్కి తీసుకుంటానని తాతా మధు ఇప్పటికే వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ శ్రేణుల ముట్టడి ప్రయత్నం.. బీఆర్ఎస్ నేతల ఎర్రవల్లి ప్రయాణం.. ఇరుపార్టీల పోటాపోటీ నిరసనలు.. కేటీఆర్, హరీశ్‌రావు అరెస్టులతో ఎర్రవల్లి, గజ్వేల్ పరిసరాల్లో గంటలపాటు రాజకీయ ఉద్రిక్తత కొనసాగింది. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు భారీ బందోబస్తును కొనసాగించారు.

# నీ తల్లికి కాదు.. మా అమ్మకు అవమానం జరిగింది

**హరీశ్‌రావుకు స్పీకర్ గడ్డం ప్రసాద్ ఘాటు బదులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దాడి ఆరోపణల అంశం తెలంగాణ అసెంబ్లీని కుదిపేసింది. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరుపై ఇప్పటివరకు చర్యలు ఎందుకు తీసుకోలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు సభలో నిలదీశారు. "మా అక్కాచెల్లెమ్మలకు జరిగింది చూస్తే గుండె తరుక్కుపోతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్రంగా స్పందిస్తూ.. "అవమానం జరిగింది నీ తల్లికి కాదు.. మా అమ్మకు. ఆవేశం నీకంటే నాకు ఉండాలి" అంటూ ఘాటుగా బదులిచ్చారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలను హరీశ్‌రావు సభలో ప్రస్తావించారు. సబితా ఇంద్రారెడ్డి గొంతు నొక్కారని, మగ పోలీసులు ఆమెతో దురుసుగా వ్యవహరించినట్లు వీడియోల్లో కనిపిస్తోందని ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించారని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి మహిళా ఎమ్మెల్యేలపైనే కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. "బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వం వారిపైనే కేసులు పెట్టి వేధించడం ఏంటి? ఇది మంచి పద్ధతి కాదు. మహిళా ప్రజాప్రతినిధులతో ఇలా వ్యవహరిస్తే ఎలా?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. జరిగిన పరిణామాలు చూస్తుంటే ఇది గౌరవ సభ కాకుండా 'కౌరవ సభ'గా మారిందని తీవ్రంగా వ్యాఖ్యానించారు. అదే సమయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తనకు ఎంతో గౌరవం ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆయనతో కలిసి సభలో పనిచేశామని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ తాతా మధు సైతం తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించి చేసినవి కావని వివరణ ఇచ్చారని, ఒకవేళ స్పీకర్ తనను ఉద్దేశించే అన్నారని భావిస్తే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటానంటూ విచారం వ్యక్తం చేశారని చెప్పారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. మహిళా ప్రజాప్రతినిధులను ప్రభుత్వం గౌరవిస్తుందని, సభాధ్యక్షుడిగా తనకూ వారిపట్ల పూర్తి గౌరవం ఉందన్నారు. "హరీశ్‌రావు.. మీరు చెప్పింది మేం విన్నాం. మేం చెప్పేది కూడా వినండి. ఆవేశం నీకు కాదు.. నాకు ఉండాలి. వాళ్లు అన్నది నీ తల్లిని కాదు.. నా తల్లిని అవమానించారు. దానికి ఏం సమాధానం చెబుతావు?" అని స్పీకర్ ప్రశ్నించారు. సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి తనకు సోదరీమణుల వంటి వారని, వారిపట్ల తనకు ఎంతో గౌరవం ఉందని స్పష్టం చేశారు. అదే సమయంలో తన తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న అంశాన్ని విస్మరించలేమని పేర్కొన్నారు. మంత్రి సీతక్క కూడా అసెంబ్లీ గేటు వద్ద జరిగిన పరిణామాలపై స్పందించారు. మహిళా పోలీసుల ఎదుట దుస్తులు విప్పాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. స్పీకర్‌ను, ఆయన తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం సమర్థనీయమా అని నిలదీశారు. సభా నిబంధనలను రూపొందించిన వారే వాటిని ఉల్లంఘిస్తూ అభ్యంతరకర భాష ఉపయోగించడం సరికాదన్నారు. అయితే తమ చీరలు లాగారని, తమపై దాడి చేశారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు చేస్తున్న ఆరోపణలపైనా సీతక్క స్పందించారు. నిజంగా అలాంటి దాడి జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులైన పోలీసులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పోలీసుల వ్యవహారశైలిపై వచ్చిన ఆరోపణలను పరిశీలిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు కూడా పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలపై ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ప్రకటించిన డిక్లరేషన్‌లోని హామీలను అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసేందుకు అవకాశం లేకుండా ఎందుకు ఉంచుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తన ఆరోపణలు ఒకవైపు.. స్పీకర్, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యల వివాదం మరోవైపు సభలో తీవ్ర వాగ్వాదానికి దారితీశాయి. ఇరువైపుల ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలన్న డిమాండ్ ఈ సందర్భంగా మరింత బలంగా వినిపించింది.

# తాతా మధు, నవీన్‌పై సస్పెన్షన్ వేటు

మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసినట్లు ఆరోపిస్తున్న వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవి గౌరవాన్ని తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని సభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించారని, మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించి స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి చైర్మన్‌కు పంపించారు. మరోవైపు అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కోర్టులో హాజరుపరిచారు. అయితే పోలీసుల రిమాండ్ అభ్యర్థనను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఒక్కొక్కరు రూ.10 వేల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించడంతో ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు.

**కోర్టు నుంచి మండలికి.. అక్కడే సస్పెన్షన్**

కోర్టు నుంచి విడుదలైన అనంతరం తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి నేరుగా శాసనమండలి సమావేశాలకు




హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇద్దరిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే మంత్రి శ్రీధర్‌బాబు సస్పెన్షన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా మండలి ఆమోదించింది.

**మండలి ఆవరణలో బీఆర్ఎస్ బైఠాయింపు**

తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరినీ సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో బైఠాయించి నిరసన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులో భాగంగానే తమ ఎమ్మెల్సీలపై చర్యలకు దిగిందని బీఆర్ఎస్ ఆరోపించగా.. స్పీకర్ పదవి, సభా మర్యాదలను కాపాడేందుకే చర్యలు తీసుకున్నట్లు అధికారపక్షం పేర్కొంది. దీంతో అసెంబ్లీ ఆవరణలో మొదలైన వ్యాఖ్యల వివాదం.. అరెస్టులు, కోర్టు పరిణామాల తర్వాత చివరకు ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్ వరకు చేరింది.

# కేసీఆర్ హత్యకు కుట్ర.. భద్రత కల్పించాలి

## కేసీఆర్ రక్షణ ప్రభుత్వ బాధ్యతే: కేటీఆర్

## పోలీసులపై నమ్మకం లేదంటూ సంచలన వ్యాఖ్యలు

## ఎర్రవల్లి వెళ్తున్న కేటీఆర్, హరీశ్ అరెస్ట్

## కాంగ్రెస్ శ్రేణులను ఎందుకు అడ్డుకోలేదని నిలదీత

## బోయిన్‌పల్లి పీఎస్ వద్ద బీఆర్ఎస్-కాంగ్రెస్ ఘర్షణ



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రతపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ ముట్టడి పేరుతో కాంగ్రెస్ శ్రేణులు కేసీఆర్‌పై కుట్రపూరితంగా హత్యాయత్నానికి పాల్పడ్డాయని ఆరోపించారు. కేసీఆర్‌కు పూర్తి రక్షణ కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. ఆయన భద్రత విషయంలో పోలీసులపై తమకు నమ్మకం లేదని, తమ నాయకుడిని తామే కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు. అయితే కేసీఆర్‌పై హత్యాయత్నం జరిగిందన్న కేటీఆర్ ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ వెలువడలేదు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు ముట్టడించేందుకు ప్రయత్నిస్తున్నారన్న సమాచారంతో కేసీఆర్‌ను పరామర్శించేందుకు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అక్కడికి బయలుదేరారు. తొలుత బొల్లారం వద్ద, అనంతరం హకీంపేట వద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

### 'కాంగ్రెస్‌ను వదిలి మమ్మల్ని అడ్డుకుంటారా?'

కాంగ్రెస్ కార్యకర్తలు కేసీఆర్ ఫామ్‌హౌస్ వరకు ఎలా వెళ్లగలిగారని కేటీఆర్ పోలీసులను ప్రశ్నించారు. తమ సొంత పార్టీ అధినేత నివాసానికి వెళ్తున్న తమను మాత్రం ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. దీనిపై డీజీపీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నివాసం వైపు ఎవరినీ అనుమతించడం లేదని పోలీసులు వివరించినప్పటికీ బీఆర్ఎస్ నేతలు వెనక్కి తగ్గలేదు. బొల్లారం చౌరస్తా నుంచి ఎర్రవల్లి వైపు పాదయాత్రగా వెళ్లేందుకు ప్రయత్నించడంతో కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని బోయిన్‌పల్లి, జవహర్‌నగర్ తదితర పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

### 'కేసీఆర్‌ను మనమే కాపాడుకోవాలి'

బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద వందలాది మంది పోలీసులను మోహరించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఆయన భద్రతపై తమకు ఆందోళన ఉందన్నారు. "కేసీఆర్‌ను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. కానీ పోలీసులపై మాకు నమ్మకం లేదు. మన నాయకుడిని మనమే కాపాడుకోవాలి" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నివాసం వద్దకు కాంగ్రెస్ శ్రేణులు వెళ్లకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ కార్యకర్తలను వదిలేసి ప్రతిపక్ష నేతలనే లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు.

### 'డైవర్షన్ రాజకీయాలు'

ఎన్నికల హామీల అమలులో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలకు తెరలేపుతోందని కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిందిపోయి కేసీఆర్, బీఆర్ఎస్‌ను విమర్శించడానికే సమయం వెచ్చిస్తున్నారని ఆరోపించారు. దళితులు, గిరిజనులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు సహా పలు అంశాల్లో ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకునే వరకు ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### 'కేంద్రం జోక్యం చేసుకోవాలి'

మాజీ మంత్రి హరీశ్‌రావు సైతం ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'డైవర్షన్ పాలిటిక్స్' చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలను చర్చించకుండా రాజకీయ విమర్శలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నివాసంపై దాడికి ముఖ్యమంత్రే ఉసిగొల్పారని హరీశ్‌రావు ఆరోపిస్తూ.. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ఎమ్మెల్యే శంకర్‌పై కేసు నమోదు చేసి, సభ్యత్వం రద్దు చేయాలని కోరారు. ఇవన్నీ బీఆర్ఎస్ నేతలు చేసిన రాజకీయ ఆరోపణలేనని, వాటిపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన రావాల్సి ఉంది.

### బోయిన్‌పల్లి పీఎస్ వద్ద రణరంగం

మరోవైపు కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తమ నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. పరిస్థితి ఒక్కసారిగా అదుపుతప్పి కొందరు రాళ్లు, కుర్చీలు విసురుకున్నట్లు సమాచారం. దీంతో పోలీస్‌స్టేషన్ పరిసరాలు రణరంగాన్ని తలపించాయి. పోలీసులు ఇరువర్గాలను నిలువరించేందుకు తీవ్రంగా శ్రమించారు.

### పలువురికి గాయాలు

ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన పలువురు కార్యకర్తలు గాయపడినట్లు సమాచారం. కాంగ్రెస్‌కు చెందిన ఓ మహిళా కార్యకర్త చేతికి తీవ్ర గాయమైనట్లు తెలుస్తోంది. అయితే గాయపడిన వారి సంఖ్య, గాయాల తీవ్రతపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అదనపు పోలీసు బలగాలను రంగంలోకి దించి ఇరువర్గాలను చెదరగొట్టారు. బోయిన్‌పల్లి, జవహర్‌నగర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలను తరలించిన పోలీస్‌స్టేషన్ల వద్ద భద్రతను పెంచారు. కేసీఆర్ భద్రతపై కేటీఆర్ చేసిన తీవ్ర ఆరోపణలు, ఎర్రవల్లి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ అగ్రనేతల అరెస్టులు, ఆ వెంటనే బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్--కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణలతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా మరింత వేడెక్కాయి.

# సాగు విస్తీర్ణం భారీగా పెంచాలి

## రైతులకు లాభసాటి పంటలపై దృష్టి

## నాబార్డు సహకారం తీసుకోవాలని ఆదేశం

## డ్రిప్ సాగుకు మరింత ప్రోత్సాహం

## అధికారులకు సీఎస్ సంజయ్ జాజు దిశానిర్దేశం



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** రాష్ట్రంలో కూరగాయలు, పండ్ల తోటలు, చిరుధాన్యాలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. రైతుల ఆదాయం పెరిగేలా లాభసాటి పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సంజయ్ జాజు అధ్యక్షతన కూరగాయల సాగు, పండ్ల తోటలు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహంపై సోమవారం సమీక్ష సమావేశం జరిగింది. వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎం.జ్ఞానప్రకాశ్, ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి పాల్గొన్నారు. రైతులకు అధిక ఆదాయం సమకూర్చే కూరగాయల సాగును మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని సీఎస్ పేర్కొన్నారు. ఏ ప్రాంతంలో ఏ పంట సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయో గుర్తించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కూరగాయలు, పండ్ల తోటలు, చిరుధాన్యాలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తీర్ణం పెరిగేలా వ్యవసాయ, ఉద్యానశాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక సహకారం అందించేందుకు నాబార్డుతో పాటు సంబంధిత సంస్థల సహకారాన్ని తీసుకోవాలని సంజయ్ జాజు సూచించారు. పంట ఉత్పత్తితోనే సరిపెట్టకుండా వాటికి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, విలువ ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయడంపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని సీఎస్ సూచించారు. ముఖ్యంగా ఉద్యాన, ప్రత్యామ్నాయ పంటల్లో డ్రిప్ ఇరిగేషన్‌తో పాటు నీటిని పొదుపుగా వినియోగించే సాగు విధానాలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానశాఖలతో పాటు వ్యవసాయ, పశువైద్య విశ్వవిద్యాలయాలు పరస్పర సమన్వయంతో పనిచేసి రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని సంజయ్ జాజు సూచించారు. వాతావరణ మార్పులను తట్టుకునే స్థిరమైన వ్యవసాయ విధానాలను రాష్ట్రవ్యాప్తంగా ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# 'నాకేం తెలియదు.. అంతా నా భర్తే చూసుకున్నాడు'

## పోలీసుల ఎదుట యూట్యూబర్ నందన వాదన

## వీసా మోసం కేసులో నాలుగు గంటల విచారణ

## కీలక ప్రశ్నలకు 'తెలియదు' అంటూ సమాధానం

## ఈ నెల 16న మళ్లీ రావాలని నోటీసులు

## భర్త మధుకర్ పాత్రపై పోలీసుల దృష్టి




**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** వీసాల పేరిట డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో యూట్యూబర్ నందన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, వీసా కన్సల్టెన్సీతో పాటు వ్యాపార లావాదేవీలన్నీ తన భర్త మధుకరే చూసుకున్నాడని ఆమె పోలీసులకు వివరించినట్లు సమాచారం. దాదాపు నాలుగు గంటలపాటు సాగిన విచారణలో పలు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రాకపోవడంతో ఈ నెల 16న మరోసారి విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. లుకౌట్ నోటీసుల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయంలో నందనను అధికారులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు ఇబ్రహీంపట్నం సీఐ తెలిపారు. అనంతరం పోలీసులు ఆమెకు విచారణ నోటీసులు జారీ చేయగా మంగళవారం హాజరైనట్లు వెల్లడించారు. విచారణలో తాను ఐటీ ఉద్యోగినిగా పనిచేస్తూ యూట్యూబర్‌గా కొనసాగుతున్నానని నందన చెప్పినట్లు పోలీసులు పేర్కొన్నారు. వీసా కన్సల్టెన్సీ కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలు, వీసాల ప్రక్రియ, డబ్బుల వసూళ్లతో తనకు సంబంధం లేదని ఆమె వివరించినట్లు తెలిపారు. సదరు కంపెనీలో తాను డైరెక్టర్‌గా గానీ, ఉద్యోగిగా గానీ లేనని, వ్యాపార వ్యవహారాలన్నీ తన భర్త మధుకరే చూసుకునేవాడని చెప్పినట్లు సమాచారం. అయితే పలు కీలక ప్రశ్నలకు నందన నుంచి 'నాకు తెలియదు' అనే సమాధానమే రావడంతో మరోసారి విచారించాలని పోలీసులు నిర్ణయించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదులో నందనతో పాటు ఆమె భర్త మధుకర్, మామగారి పేర్లు కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో నందన ఇచ్చిన వాంగ్మూలాన్ని ఇతర ఆధారాలతో సరిపోల్చడంతో పాటు ప్రస్తుతం విదేశాల్లో ఉన్నట్లు చెబుతున్న మధుకర్ పాత్రపైనా దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన విచారణ పూర్తయిన తర్వాత భర్తను విచారణకు పంపిస్తానని నందన చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆయన పిల్లలను చూసుకుంటున్నారని, తాను వెళ్లిన తర్వాత మధుకర్ భారత్‌కు వస్తారని ఆమె వివరించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 16న నందనను మరోసారి విచారించనున్న పోలీసులు.. ఆమె వాంగ్మూలం, బాధితుల ఫిర్యాదులు, ఆర్థిక లావాదేవీలు తదితర ఆధారాలను పరిశీలిస్తూ కేసులో ఎవరి పాత్ర ఎంత ఉందన్న అంశాన్ని తేల్చే దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# శాఖలను సమూలంగా మార్చాలని అధిష్ఠానానికి చెప్పా

## నాకు మంత్రి పదవి ఇవ్వడం అధిష్ఠానం నిర్ణయం

## టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో కేబినెట్ విస్తరణ, మంత్రుల శాఖల మార్పుపై ఊహాగానాలు షికారు చేస్తున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. గాంధీ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న మంత్రుల శాఖలన్నింటినీ సమూలంగా పునర్వ్యవస్థీకరించి, కొత్త శాఖలను కేటాయించాలని తాను కాంగ్రెస్ హైకమాండ్‌కు స్పష్టమైన సూచన చేసినట్లు వెల్లడించారు. పీసీసీ అధ్యక్షుడిగా తన పరిధి మేరకు పార్టీ ప్రయోజనాల కోసం ఈ సలహా ఇచ్చానని... దానిపై తుది నిర్ణయం తీసుకోవడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అధిష్ఠానం చేతిలోనే ఉందన్నారు. ఇక తనను మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై స్పందిస్తూ... ఆ విషయాలన్నీ అధిష్ఠానం నిర్ణయానికే వదిలేశానని తెలిపారు. ప్రస్తుతం పార్టీని బలోపేతం చేసే బాధ్యత కలిగిన పీసీసీ అధ్యక్షుడిగా నిరంతరం పనిచేస్తున్నానని పేర్కొన్నారు.

# పట్టుదల.. క్రమశిక్షణే విజయానికి సోపానాలు

## మైనారిటీ యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

## స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభం

## బాలికలు చదువు, ఉద్యోగాల్లో మరింత ముందుకు రావాలి

## మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** జీవితంలో విజయం సాధించాలంటే లక్ష్యంపై మక్కువ, కఠోర శ్రమ, క్రమశిక్షణ, దృఢ సంకల్పం ఎంతో అవసరమని మైనారిటీ సంక్షేమ, ప్రభుత్వ రంగ సంస్థల శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులు, యువతకు కల్పిస్తున్న విద్యా, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఇందిరా ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మైనారిటీ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని మంత్రి అజారుద్దీన్ ప్రారంభించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే మైనారిటీ యువతకు శిక్షణతో పాటు సరైన కెరీర్ మార్గదర్శనం అందించడంలో ఈ కేంద్రం కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు తక్కువ సమయంలో కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడాన్ని మంత్రి అభినందించారు. ముఖ్యంగా శాఖ డైరెక్టర్ తారిఖ్ అన్వర్ కృషిని ప్రశంసించారు. ప్రభుత్వం అవసరమైన సదుపాయాలు, అవకాశాలు కల్పిస్తుందని.. వాటిని సమర్థంగా ఉపయోగించుకుని జీవితంలో ముందుకు వెళ్లాల్సిన బాధ్యత విద్యార్థులదేనన్నారు. "జీవితంలో ఏదీ ఉచితంగా రాదు. ప్రభుత్వం మీకు అవసరమైన అవకాశాలను కల్పించింది. వాటిని అందిపుచ్చుకుని ముందుకు సాగాలి. అందుకు మీరు చెల్లించాల్సిన ధర కఠోర శ్రమ" అని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు సందేహాలను అడగడానికి ఎప్పుడూ వెనుకాడకూడదని అజారుద్దీన్ సూచించారు. ప్రశ్నించడం కూడా నేర్చుకునే ప్రక్రియలో కీలక భాగమన్నారు. తన క్రికెట్ జీవితాన్ని గుర్తుచేసుకుంటూ భారత జట్టుకు ఆడుతున్న సమయంలో అప్పటి కెప్టెన్ సునీల్ గవాస్కర్‌ను తరచూ ప్రశ్నలు అడిగి, సలహాలు తీసుకునేవాడినని చెప్పారు. ఆ మార్గదర్శనం తన ఆటను మెరుగుపరుచుకునేందుకు ఎంతో ఉపయోగపడిందన్నారు. బాలికలు విద్య, ఉద్యోగ రంగాల్లో తమ భాగస్వామ్యాన్ని మరింత పెంచుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యంపై దృష్టి పెట్టాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజాం కళాశాలలో చదువుకున్న రోజులనూ అజారుద్దీన్ గుర్తుచేసుకున్నారు. కనీస సౌకర్యాలు లేకపోయినా చెట్టు కింద కూర్చుని చదువుకున్న తన ఇద్దరు స్నేహితులు తర్వాత జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారని చెప్పారు. పరిస్థితుల కంటే పట్టుదల, కృషి ముఖ్యమని వారి జీవితం నిరూపించిందన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మైనారిటీల విద్యాభివృద్ధి, సమగ్ర అభ్యున్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని అజారుద్దీన్ తెలిపారు. యువతకు మెరుగైన అవకాశాలు కల్పించాలన్న స్పష్టమైన దృక్పథంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ విద్య ప్రాధాన్యాన్ని వివరించారు. ఖురాన్‌లో మొదటగా అవతరించిన పదం 'ఇఖ్రా' అని, దాని అర్థం 'చదువు' అని పేర్కొన్నారు. మైనారిటీ యువత సాధికారతకు విద్య, జ్ఞానమే ప్రధాన ఆయుధాలని చెప్పారు. మైనారిటీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ అధ్యక్షుడు ఫహీం ఖురేషీ మాట్లాడుతూ కొత్త కేంద్రం మైనారిటీ యువతకు కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. సివిల్ సర్వీసులు, ఇతర పోటీ పరీక్షల్లో మైనారిటీ విద్యార్థుల ప్రాతినిధ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమశాఖ డైరెక్టర్ తారిఖ్ అన్వర్, అహ్మద్ నదీమ్, ఉబైదుల్లా కొత్వాల్, అజ్మతుల్లా హుస్సేనీతో పాటు అధికారులు, ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు. అవకాశాలు తలుపుతట్టినప్పుడు వాటిని అందిపుచ్చుకుని పట్టుదలతో కష్టపడాలని, విద్యనే ఆయుధంగా చేసుకుని విజయవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని అజారుద్దీన్ యువతకు పిలుపునిచ్చారు.



## సంపాదకీయం



# అసెంబ్లీ గేటు వద్దే ప్రజాస్వామ్యానికి అడ్డుకట్టా?

**ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సరైన సంప్రదాయం కాదు**

**మహిళా ఎమ్మెల్యేల విషయంలో మరింత సంయమనం అవసరం**

**సభా నియమాలపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరే**

**అధికారానికి సంయమనం.. ప్రతిపక్షానికి బాధ్యత అవసరం**

**గేట్ల వద్ద ఘర్షణలు కాదు.. సభలో ప్రజా సమస్యలపై చర్చ జరగాలి**

తెలంగాణ శాసనసభ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఏమాత్రం శోభనివ్వవు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నల్ల దుస్తులతో సభకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడం, ఆ తర్వాత తోపులాటలు, అరెస్టులు చోటుచేసుకోవడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ముఖ్యంగా సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి వంటి మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ చేసిన ఆరోపణలు మరింత వివాదానికి కారణమయ్యాయి. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో అసలు ఏం జరిగిందన్న దానిపై నిష్పక్షపాత విచారణ అవసరం ఏర్పడింది. ప్రజలు ఎన్నుకున్న శాసనసభ్యులు సభకు వెళ్లడం వారి హక్కు మాత్రమే కాదు.. తమను ఎన్నుకున్న ప్రజల తరఫున గొంతు వినిపించాల్సిన బాధ్యత కూడా. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం, అవసరమైనప్పుడు నిరసన తెలియజేయడం ప్రతిపక్షానికి ప్రజాస్వామ్యం కల్పించిన అవకాశం. అయితే సభ్యులు సభలో ఎలాంటి దుస్తులు ధరించాలి? వాటిపై ఎలాంటి నినాదాలు ఉండవచ్చు? ఏది సభా మర్యాదలకు విరుద్ధం? ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించారా? అన్న అంశాలపై అంతిమంగా నిర్ణయం తీసుకోవాల్సింది సభాపతి. శాసనసభ గేటు వద్దే పోలీసులు ఆ పాత్రను తమ చేతుల్లోకి తీసుకునే పరిస్థితి ఏర్పడితే అది భవిష్యత్తులో ప్రమాదకరమైన సంప్రదాయానికి దారితీసే అవకాశం ఉంటుంది. ఈ వివాదంపై తెలంగాణ హైకోర్టు చేసినట్లు వెలువడిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోరాదని, సభా నియమాలను సభ్యులు ఉల్లంఘిస్తే ఆ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకర్ అని న్యాయస్థానం పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు వ్యవహరించినట్లు వచ్చిన ఆరోపణలనూ కోర్టు తీవ్రంగా పరిగణించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు మొత్తం ఘటనపై సమగ్రంగా సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఎవరి పరిధి ఎక్కడి వరకు? సభలోకి ప్రవేశించే ప్రజాప్రతినిధుల విషయంలో పోలీసులు ఎలా వ్యవహరించాలి? అన్న అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలి. మహిళా ఎమ్మెల్యేల విషయంలో వచ్చిన ఆరోపణలు మరింత సున్నితమైనవి. రాజకీయ పార్టీ ఏదైనా కావచ్చు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. మహిళా ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగించే పరిస్థితులకు ఆస్కారం ఉండకూడదు. తోపులాట సమయంలో సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని, సబితా ఇంద్రారెడ్డితో దురుసుగా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. మరోవైపు పోలీసులు ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. అందుకే అందుబాటులో ఉన్న పూర్తి వీడియో దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల బాధ్యతే. కానీ ఆ బాధ్యతను నిర్వర్తించే క్రమంలో సంయమనం, కనీస బలప్రయోగం, చట్టబద్ధమైన పద్ధతులు అత్యంత కీలకం. అందులోనూ ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులతో వ్యవహరించేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. అధికార వ్యవస్థ సంయమనం పాటించాలన్నంత మాత్రాన ప్రతిపక్షానికి బాధ్యత లేదని కాదు. నిరసన ప్రజాస్వామ్యంలో సహజమైన హక్కు. కానీ అది సభా గౌరవాన్ని దెబ్బతీసేలా ఉండకూడదు. వ్యక్తిగత దూషణలు, అభ్యంతరకర నినాదాలు, ఉద్రిక్తతను పెంచే చర్యలకు దూరంగా ఉండాలి. స్పీకర్ పదవి గౌరవాన్ని, శాసనసభ ప్రతిష్ఠను కాపాడాల్సిన బాధ్యత అధికార, ప్రతిపక్షాలకు సమానంగానే ఉంటుంది. ప్రజాస్వామ్యంలో ఎంత తీవ్రంగా విభేదించినా చివరకు చర్చకు వేదిక శాసనసభే కావాలి. నినాదాలకు సమాధానం లాఠీలు కాకూడదు. అలాగే రాజకీయ విమర్శలు వ్యక్తిగత దూషణల స్థాయికి దిగజారకూడదు. అసెంబ్లీ అంటే ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక. అక్కడ రైతుల సమస్యలు వినిపించాలి. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం, పింఛన్లు, భూములు, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం వంటి ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై చర్చ జరగాలి. ప్రతిపక్షం ప్రశ్నించాలి.. ప్రభుత్వం సమాధానం చెప్పాలి. కానీ సభ గేటు వద్ద తోపులాటలు, అరెస్టులు, పోలీసుల బలప్రయోగం, ప్రజాప్రతినిధులపై దురుసు ప్రవర్తన ఆరోపణలే ప్రధాన చర్చగా మారితే అసలు ప్రజా సమస్యలు వెనక్కి వెళ్లిపోతాయి. అంతిమంగా నష్టపోయేది ప్రజలే. అందుకే అసెంబ్లీ గేటు వద్ద జరిగిన మొత్తం ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలి. వీడియో దృశ్యాలను పరిశీలించి పోలీసుల నుంచి అతిక్రమణ జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో శాసనసభ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ప్రవేశం, నిరసనలు, పోలీసుల పాత్రపై స్పష్టమైన విధివిధానాలను రూపొందించాలి. మరోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా అధికార యంత్రాంగం, శాసనసభ వ్యవస్థ మధ్య సమన్వయం ఉండాలి. ప్రజాస్వామ్యంలో నిరసనను అణచివేయడం పరిష్కారం కాదు.. నిరసన పేరుతో సభా మర్యాదలను దాటడమూ సమర్థనీయం కాదు. అధికారానికి సంయమనం.. ప్రతిపక్షానికి బాధ్యత.. పోలీసులకు చట్టబద్ధమైన పరిధిపై స్పష్టత అవసరం. ఈ మూడూ సమతూకంగా ఉన్నప్పుడే శాసనసభ గేటు ఘర్షణలకు వేదిక కాకుండా.. సభ ప్రజల గొంతు వినిపించే నిజమైన ప్రజాస్వామ్య మందిరంగా నిలుస్తుంది.

# అంతిమ విజయం సత్యానిదే!

- యువత సత్యమార్గంలోనే నడుస్తోంది
- ప్రజా భాగస్వామ్యంతోనే శాశ్వత మార్పు
- ప్రజాసేవే అధికారానికి పరమార్థం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం
- విమర్శకులకు వడోదర వేదికగా చురకలు
- భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం




**వడోదర, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** అసత్యాలను పదేపదే ప్రచారం చేసి ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఎన్ని ప్రయత్నాలు జరిగినా అంతిమ విజయం సత్యానిదేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 'అబద్ధాల హోరు' కంటే దేశ యువత స్వరం, వారి ఆకాంక్షలే బలమైనవని పేర్కొన్నారు. గుజరాత్ పర్యటనలో భాగంగా వడోదరలో నిర్వహించిన బహిరంగ సభలో యువతను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉంటాయని, అయితే భారత యువత సత్యమార్గంలో ముందుకు సాగుతోందని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపడుతున్న విద్యార్థి కార్యక్రమాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ 'అబద్ధాల హోరు' కంటే యువత స్వరమే చివరకు గెలుస్తుందని వ్యాఖ్యానించారు. వడోదర-ముంబై మధ్య ఇటీవల ప్రారంభమైన డబుల్ డెకర్ గూడ్స్ రైలును ప్రస్తావించిన ప్రధాని.. ఒక్క ట్రిప్‌లో సుమారు 250 ట్రక్కులకు సమానమైన సరకు రవాణా చేయగల సామర్థ్యం దీనికి ఉందన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాల్లోనూ కొందరు విమర్శించడానికి కారణాలు వెతుకుతున్నారని ప్రతిపక్షాలపై చురకలు అంటించారు. "డబుల్ డెకర్ గూడ్స్ రైలు ప్రారంభిస్తే ట్రక్ డ్రైవర్ల పరిస్థితి ఏమిటని అడుగుతారు. ట్రక్కుల పరిస్థితి ఏమవుతుందని ప్రశ్నిస్తారు. విమర్శించేందుకు వారికి మరో అంశం దొరికినట్లే" అని వ్యాఖ్యానించారు. 2014కు ముందు ప్రత్యేక సరకు రవాణా కారిడార్ నిర్మాణంలో ఆశించిన పురోగతి జరగలేదని విమర్శించారు. గుజరాత్ పర్యటన సందర్భంగా వడోదరలో వేల కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం నవసారిలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. అధికారం, వ్యవస్థలు, పదవులు ప్రజలకు సేవ చేసేందుకేనని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నామనే అహంకారం కాకుండా నిరంతరం ప్రజలకు సేవ చేయడమే తమ పార్టీ కార్యకర్తల లక్ష్యమని పేర్కొన్నారు. "విశ్రాంతి అనేది నిషిద్ధం" అన్నది కేవలం నినాదం కాదని, ప్రజాసేవలో నిరంతరం పనిచేసే విధానమని చెప్పారు. నవసారి జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను మోదీ ప్రశంసించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో సాధారణ ప్రజలు భాగస్వాములైనప్పుడే వచ్చే మార్పు శాశ్వతంగా నిలుస్తుందని చెప్పారు. అలాంటి కార్యక్రమాలు సమాజంలో కొత్త విశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. నవసారిని పోషకాహార లోపం లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న కృషిని అభినందించారు. ఒక జిల్లాను పోషకాహార లోపం నుంచి విముక్తం చేయడం ఎన్నికల్లో వచ్చే ఓట్ల కంటే ఎంతో విలువైన తల్లులు, కుటుంబాల ఆశీస్సులను అందిస్తుందని వ్యాఖ్యానించారు. క్షయ వ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాలు భావితరాల ఆరోగ్యానికి పునాది వేస్తాయని పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న తొలినాళ్లను మోదీ గుర్తుచేసుకున్నారు. జూన్‌లో 44 డిగ్రీల తీవ్ర ఎండలోనూ బాలికల విద్య కోసం గ్రామాల్లో పర్యటించినట్లు తెలిపారు. చిన్నారులను పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులను ఒప్పించేందుకు చేసిన ప్రయత్నాలు తనకు రాజకీయ అధికారం కంటే ఎక్కువ సంతృప్తిని ఇచ్చాయని చెప్పారు. అభివృద్ధిపై విమర్శలు, రాజకీయ ఆరోపణలు ఎన్ని వచ్చినా యువత ఆకాంక్షలు, ప్రజల భాగస్వామ్యం, సత్యం ఆధారంగానే దేశం ముందుకు సాగుతుందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ప్రధాని భద్రతలో కలకలం

**మోదీ కార్యక్రమంలో నకిలీ గుర్తింపు కార్డుతో యువకుడు**

**వెంట వచ్చిన వ్యక్తి వద్ద తుపాకీ**

**ఇద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు**



**ముంబై, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ ముంబై పర్యటనకు ముందు భద్రతా వర్గాలను ఉలిక్కిపడే ఘటన చోటుచేసుకుంది. ప్రధాని పాల్గొనాల్సిన కార్యక్రమ వేదిక వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరి వద్ద ప్రధానమంత్రి కార్యాలయానికి చెందినదిగా చూపుతున్న నకిలీ గుర్తింపు కార్డు లభించగా.. అతడితో వచ్చిన మరో వ్యక్తి వద్ద తుపాకీ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ముంబైలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్‌లో ఉన్న నీతా ముఖేశ్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో మంగళవారం ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమం నేపథ్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో వేదిక పరిసరాల్లో రోహన్ పరేఖ్ (24) అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని భద్రతా సిబ్బంది గుర్తించినట్లు సమాచారం. అతడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తాను ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన అధికారినని చెప్పినట్లు తెలుస్తోంది. అతడు చూపించిన గుర్తింపు కార్డును పరిశీలించగా అది నకిలీదిగా తేలినట్లు సమాచారం.

**'బాడీగార్డ్' వద్ద తుపాకీ**

రోహన్‌తో పాటు ఉన్న మరో వ్యక్తి గురించి పోలీసులు ప్రశ్నించగా అతడు తన బాడీగార్డ్ అని చెప్పినట్లు సమాచారం. అయితే ఆ వ్యక్తి వద్ద తుపాకీ ఉండటాన్ని గుర్తించిన పోలీసులు వెంటనే ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లు, గుర్తింపు పత్రాలు, ఇతర వస్తువులను పోలీసులు పరిశీలిస్తున్నారు. తుపాకీకి చట్టబద్ధమైన లైసెన్స్ ఉందా? నకిలీ గుర్తింపు కార్డు ఎక్కడ తయారైంది? ప్రధానమంత్రి కార్యాలయం పేరుతో గుర్తింపు కార్డును ఎందుకు ఉపయోగించారు? ప్రధాని పాల్గొనే కార్యక్రమ వేదిక వద్దకు వీరు ఏ ఉద్దేశంతో వచ్చారు? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రధాని పాల్గొనే కార్యక్రమానికి ముందు నకిలీ గుర్తింపు కార్డు, తుపాకీతో ఇద్దరు వ్యక్తులు వేదిక పరిసరాల్లో కనిపించడం భద్రతా వర్గాల్లో కలకలం రేపింది. ఘటన వెనుక ఉద్దేశం ఏమిటన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

**నా క్లయింట్‌ను తప్పుదోవ పట్టించారు..**

ఈ కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. రోహన్ పరేఖ్ తరఫున హాజరైన లాయర్ తన క్లయింట్ మోసపోయి ఉండొచ్చని ముంబై కోర్టులో వాదించారు. కోర్టు విచారణ సందర్భంగా రోహన్‌కు అధికారికంగా కనిపించే ఆఫర్ లెటర్, గుర్తింపు కార్డు, ప్రధాని మోదీ సంతకంతో ఉన్నట్లు చెబుతున్న ఒక లేఖ అందాయని లాయర్ తెలిపారు. ఇదే కాకుండా ప్రధాని కార్యాలయంలో అదనపు కార్యదర్శి పేరుతో ఉన్నట్లు చెబుతున్న ఓ ఈమెయిల్ కూడా రోహన్‌కు వచ్చినట్లు కోర్టుకు వెల్లడించారు. ఈ పత్రాలు, సంప్రదింపుల కారణంగానే తన క్లయింట్ నిజంగా పీఎంఓకు సంబంధించిన ఉద్యోగం పొందినట్లు నమ్మాడని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. ఎవరో వ్యక్తి రోహన్‌ను మోసం చేసి ఉండొచ్చని పేర్కొన్నారు. అయితే, రోహన్ చెబుతున్నవి నిజాలా? లేదా? , అతడి వద్ద లభించిన ఐడీ కార్డు నిజమైందా.? ఎవరు తయారు చేశారు? దీని వెనక ఎవరున్నారనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ముంబై కోర్టు రోహన్ పరేఖ్‌ను సెప్టెంబర్ 11 వరకు పోలీస్ కస్టడీకి పంపింది.

# టీచర్ల నియామకాల్లో అర్హతలేనివారికి 'నో ఎంట్రీ'

**సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ■ నిర్దేశిత అర్హతలు తప్పనిసరి**

**విలీనం పేరుతో నిబంధనలు పక్కన పెట్టొద్దు ■ పారదర్శకత, మెరిట్‌కే ప్రాధాన్యం**

**విద్యార్థుల ప్రయోజనాలే ముఖ్యమన్న ధర్మాసనం**




**ఢిల్లీ, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యావ్యవస్థలో నాణ్యతను కాపాడేందుకు అర్హత లేని వ్యక్తులను టీచర్లుగా నియమించకూడదని స్పష్టం చేసింది. ఆర్టీఈ, ఎన్సీటీఈ, యూజీసీ నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని కొత్తగా నియమించడం మాత్రమే కాకుండా.. ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కొనసాగించడానికి వీల్లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల నియామకాల్లో విద్యార్థుల ప్రయోజనాలు, బోధనా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. ప్రభుత్వ సర్వీసుల్లోకి ఉపాధ్యాయులను విలీనం చేసే పేరుతో పారదర్శకమైన, పోటీతత్వ నియామక ప్రక్రియను పక్కన పెట్టడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎలాంటి పారదర్శక నియామక ప్రక్రియ లేకుండా.. అర్హతలు లేని వ్యక్తులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడాన్ని అంగీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆర్టీఈ, ఎన్సీటీఈ, యూజీసీ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నవారినే ఉపాధ్యాయులుగా నియమించాలని పేర్కొంది. అర్హత ప్రమాణాలను పాటించకుండా నియామకాలు చేపడితే విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. దీంతో టీచర్ల నియామకాల్లో ఇకపై నిబంధనలు, పారదర్శకత, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.




# ఐక్యరాజ్యసమితి కొత్త మ్యాప్

**అరుణాచల్, అక్సాయ్ చిన్‌లపై వేర్వేరు సరిహద్దు గీతలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** ఐక్యరాజ్యసమితి (యూఎన్) విడుదల చేసిన నూతన ప్రపంచ పటం భారత్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్ చిన్ ప్రాంతాల సరిహద్దుల విషయంలో భారత, చైనా దేశాల వాదనలకు అనుగుణంగా వేర్వేరు గీతలను (ఇండియన్ లైన్, చైనీస్ లైన్) చూపించడం వివాదానికి దారితీసింది. అయితే, ఈ ప్రాంతాలను చైనాలో భాగమని యూఎన్ అధికారికంగా ప్రకటించలేదని, కేవలం ఇరు దేశాల ప్రాదేశిక వాదనలను ప్రతిబింబించేలా ఈ గీతలను పొందుపరిచినట్లు తెలుస్తోంది. భూభాగాల పరిమాణాలను వాస్తవికంగా చూపించే లక్ష్యంతో యూఎన్ జనరల్ అసెంబ్లీ 'కరెక్ట్ ది మ్యాప్' తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త మ్యాప్‌లో అరుణాచల్ ప్రదేశ్‌కు అస్సాం వైపు ఉన్న దక్షిణ సరిహద్దును 'చైనీస్ లైన్'గా, టిబెట్ వైపు ఉన్న ఉత్తర సరిహద్దును 'ఇండియన్ లైన్'గా చూపించారు. అలాగే లద్దాఖ్‌లోని అక్సాయ్ చిన్ ప్రాంతంలోనూ రెండు వేర్వేరు గీతలను పొందుపరిచారు. జమ్మూ కాశ్మీర్ విషయంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉన్న లైన్ ఆఫ్ కంట్రోల్ (ఎల్ఓసీ)ను చుక్కల గీతతో సూచిస్తూ, దీనిపై ఇంకా తుది ఒప్పందం కుదరలేదని వివరణ ఇచ్చారు. ఈ తీర్మానానికి భారత్ మద్దతు తెలిపినప్పటికీ, యూఎన్ మ్యాప్‌లలో ప్రదర్శించే సరిహద్దుల చిత్రీకరణను తాము ప్రత్యేకంగా ఆమోదించడం లేదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

# తాత మధు పై పోలీసుస్టేషన్ లో పిర్యాదు

- **తాతా మధు వ్యాఖ్యలకు నిరసనగా భగ్గుమన్న చేవెళ్ళ కాంగ్రెస్**
- **తాతా మధు దిష్టిబొమ్మ దహనం.. ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్**
- **తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**

**సెప్టెంబర్.08.చేవెళ్ల.(సమయం న్యూస్)** తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గారి పైన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. భీమ్ భరత్ చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు

తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, గడ్డం ప్రసాద్ కుమార్ పైMLC తాత మధు చేసిన అత్యంత హేయమైన, నీచమైన, కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ఒక వ్యక్తిపై చేసిన దాడి కాదు – ఇది రాజ్యాంగంపై దాడి, ఇది 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై దాడి, రాజ్యాంగబద్ధమైన, అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్ పై కించపరిచేలా మాట్లాడటం... సభా ప్రాంగణంలోనే ఇంత నీచానికి దిగజారడం చరిత్రలో చీకటి రోజు. భారతదేశ చరిత్రలో ఏ చట్టసభలోనూ ఇలాంటి దుర్మార్గం జరగలేదు. అధికారం పోయిందనే అక్కసుతో, ఓర్వలేక ఇలాంటి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు. ఇది వారి సంస్కారానికి నిదర్శనం. MLC తాత మధు వెంటనే బేషరతుగా ప్రజలకు, స్పీకర్ కి క్షమాపణ చెప్పాలి. అతన్ని తక్షణమే శాసన మండలి నుండి అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ మొయినాబాద్ మండలం మాజీ అధ్యక్షులు మానయ్య , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సత్య నారాయణ మొయినాబాద్ మున్సిపల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి , స్థానిక కౌన్సిలర్ లు సీనియర్ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఉన్నత లక్ష్యాలతో మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలి

**జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్ మున్సిపల్, సెప్టెంబర్,08(సమయం న్యూస్)**

వికారాబాద్: ఉన్నత లక్ష్యాలతో మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ విద్యార్థినిలకు సూచించారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, రామయ్య గూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో పదవ తరగతి సాంఘిక శాస్త్రం బోధిస్తున్న తరగతిని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రాథమిక హక్కులు, విధులపై విద్యార్థినీలను అడిగి సమాధానము రాబట్టారు. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చని ఆదిశగా విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యనభ్యసించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఒక్కరికి లక్ష్యం అనేది గొప్పగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. విద్యతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంచుకునే విధంగా వ్యాయామం చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ఆరోగ్యకరమైన శరీరంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా చాలా అవసరమని ఆయన అన్నారు.విద్యార్థులకు గత సిలబస్ పై కూడా అప్పుడప్పుడు సమీక్షిస్తూ ఉండాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు.ముందుగా భోజనశాల, స్టోర్, వంటగదులను లను సందర్శించి మధ్యాహ్న భోజనానికి సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించారు. అనంతరం రామయ్య గూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన క్రమంలో ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్యంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులకు సూచించారు. ఆసుపత్రి మరమత్తు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఆసుపత్రిలో త్రాగునీటి కోసం ఆర్.ఓ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ఆసుపత్రి స్థలంలో కబ్జాలకు గురికాకుండా ఆవరణ చుట్టు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు.జిల్లా కలెక్టర్ పర్యటనలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జెడ్పి సీఈఓ సుధీర్, డిఎంహెచ్ఓ సుధాకర్ లాల్, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, డాక్టర్ సౌమ్యలు ఉన్నారు.



# మహిళల భద్రత కోసం "షీ" టీమ్ ప్రత్యేక చర్యలు

- **పరిగి సబ్‌డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు**
- **జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అదేశాలమేరకు**

**పరిగి మున్సిపల్, సెప్టెంబర్, 08(సమయం న్యూస్)** మహిళలు, బాలికల భద్రతను పరిరక్షించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న "షీ" టీమ్ సమర్థవంతంగా సేవలందిస్తోందని పరిగి సబ్‌డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు అన్నారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పరిగి డిఎస్పీ శ్రీనివాస్ మార్గదర్శకత్వంలో పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో పరిగి సబ్‌డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు విద్యార్థినిలకు సోమవారం పలు ముఖ్య అంశాలపై విద్యార్థులు, విద్యాతినిలకు అవగాహన కల్పించారు.ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 112, "షీ" టీమ్ హెల్ప్‌లైన్ 181, సీసీ కెమెరాల ప్రాముఖ్యత వంటి విషయాలను వివరించారు. అలాగే బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం అలాగే సైబర్ నేరాలపై (హెల్ప్‌లైన్ నం. 1930) సమగ్ర అవగాహన కల్పించారు.విద్యార్థులు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను సంప్రదించాలని ఇంచార్జి నర్సిములు సూచించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రావుఫ్,స్కూల్ ఉపాద్యాయులు మరియు విద్యార్థినిలు, "షీ" టీమ్ సభ్యులు బి. సావిత్రి,శోభ ఉన్నారు.




# రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి

**నిర్మల్, సెప్టెంబర్ 8( సమయం న్యూస్)** జిల్లాలో 2026–27 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించేందుకు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. అర్హులైన రైతులు, విద్యార్థులు, యువత, మహిళా స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారులకు సకాలంలో రుణాలు అందించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశంలో కలెక్టర్ రుణాల పురోగతిని సమీక్షించారు. జిల్లాకు రూ.7,952.87 కోట్ల వార్షిక రుణ లక్ష్యం ఉండగా ఇప్పటివరకు రూ.2,331.18 కోట్లు, అంటే 29.31 శాతం సాధించినట్లు తెలిపారు. ప్రాధాన్యతా రంగాల్లో రూ.6,661.73 కోట్ల లక్ష్యానికి రూ.1,847.71 కోట్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. విద్యా రుణాలు పెంచాలని, బ్యాంకు ఖాతాలు లేని వారికి సెప్టెంబర్‌లోగా ఖాతాలు తెరవాలని ఆదేశించారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ పథకాల అమలును వేగవంతం చేయాలని సూచించారు. విజయ డెయిరీతో సమన్వయంతో రైతులకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు అందించాలని, రైస్ మిల్లుల ఫైనాన్స్‌కు అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశంలో ఎల్‌డీఎం బి. రామ్‌గోపాల్‌తో పాటు ఆర్‌బీఐ, నాబార్డ్, వివిధ బ్యాంకులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహింఆచాలి



**కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్, సెప్టెంబర్, 08 (సమయం న్యూస్)** వికారాబాద్; ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.మంగళవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆలంపల్లి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐఆర్ విచారణకు వచ్చిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి డాక్యుమెంట్లు అప్లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. అనామలీస్, మ్యాపింగ్ కానీ, ఓటర్ జాబితాలో పుట్టిన తేదీల మార్పుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఇప్పటివరకు కూడా నోటీసులు జారీ చేయని వారిని గుర్తించి విచారణకు హాజరు అయ్యేవిధంగా బిఎల్ఓ లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, వీఆర్వో స్వర్ణలత, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి లు ఉన్నారు.

# దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**డీఎల్ఎస్ఏ కార్యదర్శి దేవి మానస**



**ఖమ్మం సెప్టెంబర్8( సమయం న్యూస్)** : దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. దేవి మానస సూచించారు. ఖమ్మంలోని ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగజన్ కౌశల్ వికాస్ ద్వారా నైపుణ్యాభివృద్ధి, దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు ద్వారా ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. దివ్యాంగుల హక్కుల చట్టం–2016 ద్వారా కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన అవకాశాలపై అవగాహన కల్పించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు డీఎల్ఎస్ఏను సంప్రదిస్తే అర్హులకు ఉచిత న్యాయ సహాయం, సలహా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎ. ప్రమీల, డీఎల్ఎస్ఏ ప్యానెల్ న్యాయవాదులు, సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు దిష్టి బొమ్మ దహనం.!

**తాతా మధు వ్యాఖ్యలపై షాబాద్ కాంగ్రెస్ పార్టీ నిరసన జ్వాలలు..**



**చేవెళ్ల సెప్టెంబర్.08. (సమయం న్యూస్)**

★షాబాద్ పోలీస్ స్టేషన్ లో తాత మధు పైన జిల్లా ప్రధాన కార్యదర్శి పామేన భార్గవ రామ్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పిర్యాదు చేసారు . తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్, గడ్డం ప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ నాయకుడు తాతా మధు చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలను షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. రాజ్యాంగబద్ధమైన, అత్యున్నతమైన స్పీకర్ పదవిని కించపరిచే విధంగా మాట్లాడడం అనేది ప్రజాస్వామ్యంపై దాడి చేయడమే. స్పీకర్ పదవి ఏ ఒక్క పార్టీకో, వ్యక్తికో చెందినది కాదు, అది తెలంగాణ ప్రజాస్వామ్యానికి ప్రతీక. అలాంటి పదవిలో ఉన్న వ్యక్తిని ఉద్దేశించి ఇష్టానుసారంగా, బాధ్యతారాహిత్యంగా మాట్లాడడం బీఆర్ఎస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. అధికారం కోల్పోయిన అక్కసుతోనే బీఆర్ఎస్ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, స్పీకర్ గారికి, తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఈరోజు షాబాద్ మండల కేంద్రంలో షాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతమైతే కాంగ్రెస్ పార్టీ తరపున మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన కలెక్ట ర్



**కరీంనగర్ సెప్టెంబర్8( సమయం న్యూస్)** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదామును మంగళవారం కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి (రెవెన్యూ) వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతను పరిశీలించడంతో పాటు సీసీ కెమెరాల పనితీరు, సిబ్బంది హాజరు, ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేపీ, ఏఐఎంఐఎం, బీఎస్పీ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# భూ సర్వే పారదర్శకంగా, పక్కాగా సాగాలి: కలెక్ట ర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, సెప్టెంబర్ 8:( సమయం న్యూస్)** జిల్లాలో సమగ్ర భూ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని చెరువుముందు తండాలో జరుగుతున్న భూ సర్వేను మంగళవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ల వినియోగం, హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను తనిఖీ చేశారు. సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు చేపట్టాలని, సాంకేతిక పరిజ్ఞానంతో రికార్డులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, సర్వేయర్లు, జీపీ ఓ నర్మద, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు జారీ

## వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి.



**వలిగొండ సెప్టెంబర్ 08 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రత దృష్ట్యా పలు సూచనలు జారీ చేశారు. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన ముఖ్యమైన నిబంధనలు **ముందస్తు అనుమతి తప్పనిసరి.**

గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ, మరియు మున్సిపల్/గ్రామ పంచాయతీ అధికారుల నుండి ముందస్తు అనుమతి పత్రాలను పొందాలి. ట్రాఫిక్కు అంతరాయం కలగవద్దు: రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది కలిగేలా, వాహనాల రాకపోకలను అడ్డుకునేలా మండపాలను ఏర్పాటు చేయకూడదు.డీజేలపై నిషేధం ధ్వని కాలుష్యం: రాత్రి వేళల్లో సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం దాటిన తర్వాత మైకులు, ధ్వని కాలుష్య కారక పరికరాలను వాడకూడదు. డీజేల వాడకంపై కఠిన నిబంధనలు వర్తిస్తాయి. భద్రతా చర్యలు & సీసీ కెమెరాలు ప్రతి మండపం వద్ద నిర్వాహకులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో మండపం వద్ద కనీసం ఇద్దరు లేదా ముగ్గురు నిర్వాహకులు తప్పనిసరిగా కాపలా ఉండాలి. పోలీస్ స్టేషన్ నుండి తప్పకుండా అనుమతులు తీసుకోవాలని సబ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. శోభయాత్ర సమయములో ఎవరైనా శాంతి భద్రతలకి విఘాతం కలిగించినట్లయితే చట్టపరముగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

# ఎస్ జీఎఫ్ వాలీబాల్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS




**కుల్కచర్ల మండలం, సెప్టెంబర్,08(సమయం న్యూస్)** పరిగి జోన్ స్థాయి ఎస్‌జీఎఫ్ (SGF) అండర్–14, అండర్–17 బాలికల వాలీబాల్ టోర్నమెంట్ కమ్ సెలెక్షన్స్ 2026–27 కార్యక్రమం మంగళవారం సాల్వేడ్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడలు జీవితంలో ఎంతో ముఖ్యమైనవని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం, ఫిట్‌నెస్‌తో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే స్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు.క్రీడల్లో గెలుపు, ఓటములు జీవితంలో ఎన్నో విలువైన పాఠాలను నేర్పుతాయని, ఓటమి గెలుపుకు తొలి అడుగు అని అన్నారు. ఓటములతో నిరుత్సాహపడకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఒక డ్రీమ్ (లక్ష్యం) ఉండాలని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు స్పష్టమైన గమ్యాలను ఏర్పాటు చేసుకుని కష్టపడి పనిచేయాలని ఎస్పీ సూచించారు. క్రీడల్లో ప్రతిభను చాటుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం ఎస్పీ క్రీడాకారులను పరిచయం చేసుకుని, టోర్నమెంట్‌లో పాల్గొంటున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాసులు, పరిగి సీఐ కె. కొండల్ రెడ్డి,ఎంఇఓ జైపాల్ రెడ్డి,పిఏసీఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి,ఏఎంఎస్ చైర్మన్ బి.ఎస్.అంజనేయులు, సాల్వేడ్ సర్పంచ్ లక్ష్మమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# బొంరస్ పెట్ మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించిన..

## నియోజకవర్గ ఇంచార్జ్ నీలి జనార్ధన్,



**బొంరస్ పేట మండలం, సెప్టెంబర్,08(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజక వర్గం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ జెండాను కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నీలి జనార్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,, రాష్ట్రానికి మహిళా ముఖ్యమంత్రిగా కవిత రావాలని ఆకాంక్షించారు.పార్టీ కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే కోస్గిలో నిర్వహించనున్న బహిరంగ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొంరస్ పేట మండల ఇన్చార్జ్ పి వెంకటయ్య. గుండు మాల్ మండల ఇన్చార్జి ఆకుల శ్రీనివాస్. కోస్గి టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు–2026 భద్రతా, బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ సమీక్ష

**వికారాబాద్,సెప్టెంబర్,08(సమయం న్యూస్)**



గణేష్ ఉత్సవాలు–2026 సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన భద్రతా, బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS జిల్లా పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉన్నతాధికారులు సూచించిన భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో తూచా తప్పకుండా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ మండపాలు, నిమజ్జన ప్రదేశాలు, నిమజ్జన మార్గాలను ముందుగానే గుర్తించి, పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, పార్కింగ్, లైటింగ్ తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. తమ పరిధిలోని గణేష్ మండపాల పూర్తి వివరాలను సేకరించి, నిర్వాహకులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు.నిర్వాహకులకు అన్ని భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించి, మండపాల వద్ద వాలంటీర్లను ఏర్పాటు చేసి క్రమశిక్షణతో బాధ్యతలను నిర్వర్తించేలా చూడాలని ఆదేశించారు.గణేష్ మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, జన సమూహాల నియంత్రణ, మహిళలు మరియు చిన్నారుల భద్రత, సీసీటీవీ నిఘా, అత్యవసర నిష్క్రమణ మార్గాలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు.గణేష్ మండపాలు,నిర్వాహకులు, నిమజ్జన మార్గాలు మరియు ఇతర సంబంధిత వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు/అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఏదైనా సమస్య లేదా అవాంఛనీయ పరిస్థితి తలెత్తిన వెంటనే స్పందించేలా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిమజ్జన మార్గాలను ముందుగానే పరిశీలించి, ట్రాఫిక్ మళ్లింపులు, రూట్ మ్యాపింగ్, బారికేడింగ్, పార్కింగ్ ప్రాంతాలు, జన సమూహాల నియంత్రణ, అత్యవసర వాహనాల రాకపోకలకు మార్గాలు తదితర అంశాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.గణేష్ విగ్రహాల తరలింపు సమయంలో డీజే మరియు శబ్ద నియంత్రణ నిబంధనలు, ఊరేగింపు సమయాలు, ట్రాఫిక్ నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు, భక్తులకు ముందస్తుగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి కమిటీలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి, ముందుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అత్యంత బాధ్యతాయుతంగా, సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ స్నేహ

# తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- **రహమతుల్లా మహమ్మద్, కాంగ్రెస్ యువ నాయకుడు**
- **కాజీపేట పోలీసులకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు**

**కాజీపేట, సెప్టెంబరు 8 (సమయం న్యూస్):** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఆయనపై ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీస్) నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ యువ నాయకుడు రహమతుల్లా మహమ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జి.మౌనికా రెడ్డిని కలిసి ఫిర్యాదు అందజేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి అయినందున ఆయనపై చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలను పోలీసులు సమగ్రంగా పరిశీలించి, వర్తించే చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. తాతా మధు వ్యాఖ్యలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఏ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి గౌరవానికి భంగం



కలగకుండా చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ అరూరి సాంబయ్య, తాజా మాజీ కార్పొరేటర్ విజయశ్రీ రజాలి, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పసునూరి మనోహర్, 62వ డివిజన్ అధ్యక్షుడు పాలడుగుల అంజనేయులు, మైనారిటీ వైస్‌ప్రెసిడెంట్ తబు షబ్బీర్, మహమ్మద్ షాకీర్, మాచర్ల జయకర్, కుమ్మరి రవికుమార్, బొల్లికొండ తేజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు శిక్షణ, మరియు అవగాహన కార్యక్రమం

**గుండుమాల్ మండలం, సెప్టెంబర్,08(సమయం న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం – వ్యవసాయ శాఖ , నారాయణపేట్ జిల్లా, కోస్గి డివిజన్ – గుండుమాల్ మండలం లో వ్యవసాయ సంకేతిక యోజమాన్య సంస్థ – ఆత్మ (ATMA) – ఆధ్వర్యంలో" Recognition of Prior Learning (RPL) Training Programme నిర్వహించడం జరిగింది. ఈ రైతుల శిక్షణ కార్యక్రమంలో వ్యవసాయంలో అనుభవం కలిగిన రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, పంటల నిర్వహణ, విత్తన శుద్ధి, ఎరువుల సమర్థ వినియోగం, పురుగు మరియు



వ్యాధి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. అలాగే రైతులలో ఇప్పటికే ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వాటిని మరింత మెరుగుపరచేందుకు శిక్షణ అందించడం జరిగింది. ఈ కార్యక్రమం రైతుల ఆదాయ వృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ మరియు స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి దోహదపడుతుంది. ఆత్మ – సహకారంతో నానో ఎరువులు నానో యూరియా & నానో డీఏపీ వినియోగంపై రైతులకు గుండుమాల్ మండల కేంద్రంలో సుధాకర్ రెడ్డి అనే రైతు పొలం లో క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించబడిది. రైతులు నానో యూరియా ప్లస్, నానో DAP వంటి నానో ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో, సిఫారసు చేసిన మోతాదులో ఉపయోగించడం ద్వారా ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. ప్రోగ్రామ్ లో పాల్గొన్న వారు నారాయణపేట జిల్లా – ఆత్మ (ATMA) ప్రాజెక్ట్ డైరెక్టర్ శాంతి నిర్మల,ఏ.డి.ఏ రామకృష్ణ,ఏ.ఓ రేష్మ రెడ్డి , ఏఇఓలు హర్ష వర్ధన్, కే.తిరుపతి, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ గడప వద్దే ప్రజాస్వామ్యానికి సంకెళ్లా ?

- **మహిళా ఎమ్మెల్యేలపై దాడిని ఖండిస్తూ బీఆర్ఎస్ నిరసన**
- **మహిళా ప్రజాప్రతినిధుల గౌరవం కాపాడాలి**

**నర్సంపేట, సెప్టెంబరు 8 (సమయం న్యూస్)** : అసెంబ్లీ ఎదుట మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి , సునీతా లక్ష్మారెడ్డిపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ నర్సంపేట పట్టణ బీఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగేల్లి వెంకట నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ద్వారం వద్ద మాజీ హోంమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ని పురుష పోలీసులు జుట్టుపట్టి లాగి కిందపడేశారని, ఆమె గొంతు పట్టుకునేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను లాగుతూ పోలీసులు వ్యవహరించడం అమానుషమని విమర్శించారు. ప్రజలచే ఎన్నికైన శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే అవమానమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతోపాటు ప్రతిపక్షానికీ సమాన ప్రాధాన్యం ఉంటుందని, ప్రజల సమస్యలను ప్రశ్నించే హక్కును ఎవరూ హరించలేరని నాయకులు అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంటుకు నల్లచొక్కా ధరించి వచ్చి నిరసన తెలిపినప్పుడు, సభలో ప్లకార్డులు ప్రదర్శించినప్పుడు, న్యాయ్‌యాత్ర పేరుతో ప్రజల మధ్యకు వెళ్లినప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య హక్కుల గురించి మాట్లాడిందని గుర్తుచేశారు. అదే తెలంగాణలో ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకులు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపితే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. నల్ల చీర, నల్లచొక్కా కేవలం వస్త్రాలు, రంగులు మాత్రమే కాదని ప్రజల ఆవేదన, నిరసనకు ప్రతీకలని పేర్కొన్నారు. పాలనపై ప్రశ్నలు సంధిస్తున్న ప్రతిపక్షాన్ని, ప్రజల తరపున మాట్లాడుతున్న నాయకులను అడ్డుకోవడం సరికాదని అన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయడం కాకుండా ప్రజల ప్రశ్నలకు




ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేల చీర, జుట్టు పట్టుకునే స్థాయికి పోలీసులు వెళ్లారన్న ఆరోపణలు తీవ్రంగా బాధించేవిగా ఉన్నాయని, ఇలాంటి దౌర్జన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని అన్నారు. అసెంబ్లీ ప్రజల సమస్యలను చర్చించే పవిత్ర వేదిక అని, అక్కడే ప్రజాప్రతినిధుల హక్కులను కాలరాయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పాతరేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర రైతు డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, డివిజన్ నాయకుడు డా. లెక్కల విద్యాసాగర్ రెడ్డి , బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, కౌన్సిలర్లు రాయిడి కీర్తి, దుమ్మటి రమ్య, శివరాత్రి స్వామి, మండల శ్రీదేవి, భూస శిరీష, మాజీ కౌన్సిలర్లు దార్ల రమాదేవి, నాగిశెట్టి ప్రసాద్, బండి ప్రవీణ్, మహిళా పట్టణ అధ్యక్షురాలు వాసం కరుణ, మహిళా నాయకురాళ్లు విజయ, రాణి, స్వరూప, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు రాయిడి దుష్యంత్ రెడ్డి , నాయకులు నాగిరెడ్డి, ప్రవీణ్, కుమారస్వామి, సాలయ్య, మంద ప్రసాద్, రాంప్రసాద్, గంగిడి సాంబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండియాతో చారిత్రాత్మక పోరుకు జపాన్ జట్టు ప్రకటన





ప్రస్తుత టీ20 ప్రపంచ ఛాంపియన్, ఐసీసీ నంబర్ వన్ ర్యాంకర్ అయిన టీమ్ ఇండియాతో సెప్టెంబర్ 22న టోచిగిలోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే చారిత్రాత్మక టీ20 సమరానికి జపాన్ క్రికెట్ బోర్డు.. తమ జట్టును అధికారికంగా అనౌన్స్ చేసింది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నివేదిక ప్రకారం, ఈ మ్యాచ్ ముగిసిన రెండు రోజులకే నగోయాలో ఆరంభమయ్యే స్వదేశీ ఆసియా క్రీడల కోసం ఎంపిక చేసిన స్క్వాడ్‌నే ఈ మ్యాచ్ బరిలోకి దించుతున్నారు. జపాన్ తరఫున అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడు కెండల్ కడోవాకి-ఫ్లెమింగ్ ఈ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. అతడితో పాటు 50కి పైగా టీ20 మ్యాచ్‌లు ఆడిన అనుభవజ్ఞులైన ఇబ్రహీం తకాహాషి, డెక్లాన్ సుజుకి-మెక్‌కాంబ్ జట్టులో కీలకం కానున్నారు. ఆసియా క్రీడల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని ఈ జట్టును సెలెక్ట్ చేయడంతో, ఐసీసీ అర్హత ఉన్నప్పటికీ గేమ్స్ నిబంధనల పరిధిలోకి రాని కొంతమంది ఆటగాళ్లను తప్పించాల్సి వచ్చిందని తెలుస్తోంది. ఈ పరిణామం దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన యువ స్పిన్ ఆల్‌రౌండర్ జేక్ కుసుడ-నైర్న్‌కు మార్గం సుగమం చేసింది. 2013లో మొదటిసారి జపాన్‌కు ప్రాతినిధ్యం వహించిన సీనియర్ ఆటగాడు సుయోషి తకాడా మళ్లీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. స్కూల్ క్రికెట్ బుకాట్సు ప్రోగ్రామ్‌ల ద్వారా వెలుగులోకి వచ్చిన వతారు మియాచి, మకోటో తానియామాలు ఈ లైనప్‌లో చోటు దక్కించుకున్నారు. ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వార్న్ బౌలింగ్ వీడియోలు చూస్తూ లెగ్ స్పిన్ నేర్చుకున్న తానియామా, తన ఆరాధ్య క్రికెటర్ జెర్సీ నంబర్ 23 ధరించి ఆడనున్నారు. ఈ అరుదైన మ్యాచ్ భారత్, జపాన్ దేశాల ద్వైపాక్షిక సంబంధాల 75 సంవత్సరాల వేడుకల్లో భాగంగా 'స్పోర్ట్ 75' పేరుతో నిర్వహిస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని సనాయ్ తకైచిల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఇరు దేశాల ప్రజల మధ్య క్రీడా సంబంధాలను విస్తరించడానికి ఈ వేదిక ఉపయోగపడనుంది. భారత్‌తో పోరుకు ముందు జపాన్ సెప్టెంబర్ 19, 20 తేదీల్లో హాంకాంగ్‌తో రెండు టీ20లలో అమీతుమీ తేల్చుకోనుంది. ఆ తర్వాత ఆసియా క్రీడల్లో భాగంగా సెప్టెంబర్ 24న అఫ్గానిస్తాన్, 26న నేపాల్‌తో తలపడనుంది.మరోవైపు టీమ్ ఇండియా ఈ చారిత్రక పోరు కోసం శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వైభవ్ సూర్యవంశీలతో కూడిన దుర్భేధ్యమైన జట్టును ప్రకటించింది.



# భారత్ ను చూసి నేర్చుకోండి

## ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ సూచన

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అనుసరిస్తున్న తప్పుడు విధానాలపై ఆ దేశ మాజీ టెస్టు కెప్టెన్ మిస్బా ఉల్ హక్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న జట్టు నుంచి ఏడుమంది ప్లేయర్లు, ఇద్దరు కోచ్‌లను ఆకస్మికంగా స్వదేశానికి రప్పించాలన్న బోర్డు నిర్ణయాన్ని తప్పుపట్టారు. ఈ అనూహ్య పరిణామాల నేపథ్యంలోనే ఆయన సెలెక్టర్ పదవికి సైతం రాజీనామా చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సెలెక్షన్ కమిటీ సభ్యులందరికీ పీసీబీ షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై మిస్బా తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతికూల పరిస్థితులలో కూడా హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను బాధ్యతల నుంచి తప్పించడం సరికాదని అన్నారు. ఓటమి ఎదురైన ప్రతిసారీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దకుండా తాత్కాలిక మార్పులకే బోర్డు ప్రాధాన్యత ఇస్తోందని విమర్శించారు. విదేశాల నుంచి వచ్చే కోచ్‌లకు బోర్డు అపరిమితమైన అధికారాలను ఇస్తోందని, ఒకవేళ జట్టు విఫలమైనా వారిపై ఎలాంటి బాధ్యతను మోపట్లేదని మండిపడ్డారు. అదే సమయంలో సొంత కోచ్‌లకు మాత్రం కనీస మద్దతు ఇవ్వట్లేదని, ప్రతి చిన్న దానికి వారిని బోనులో నిలబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను విదేశీ కోచ్‌ల నియామకాన్ని తప్పుబట్టట్లేదని, విదేశీ కోచ్‌ల పట్ల కొంత సాఫ్ట్ కార్నర్ ఉంటోందని వ్యాఖ్యానించారు. అదే స్థానిక కోచ్‌ల విషయానికి వస్తే ప్రతి ఒక్కరూ వారిని విమర్శించడమే పనిగా పెట్టుకుంటారని చెప్పారు. ఈ సందర్భంగా భారత క్రికెట్ బోర్డు అనుసరిస్తోన్న విధానాలను మిస్బా ఉదహరించారు. భారత జట్టు ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానంలో కొనసాగడం వెనుక దశాబ్దాల కఠోర శ్రమ ఉందని అన్నారు. 1990ల నుంచి భారత్ తమ క్రికెట్ నిర్మాణంపై దృష్టి పెడుతూ వచ్చిందని, దాని ఫలితాల వల్లే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి గొప్ప ఆటగాళ్లు పుట్టుకొచ్చారని గుర్తుచేశారు. పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రస్తుతం యువ ఆటగాళ్లకు టెస్ట్ క్రికెట్ ఆడే అవకాశం చాలా తక్కువగా లభిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరం ఆటగాళ్లు ఎక్కువగా పరిమిత ఓవర్ల క్రికెట్‌కే ప్రాధాన్యత ఇస్తోన్నారని, దీనివల్ల టెస్ట్ ఫార్మట్ లో రాణించే నైపుణ్యాలు కొరవడుతున్నాయని విశ్లేషించారు. ఒత్తిడిని తట్టుకోలేకపోవడానికి ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడకపోవడమే కారణమని చెప్పారు. పాకిస్తాన్ క్రికెట్ పూర్వవైభవాన్ని సంతరించుకోవాలంటే పీసీబీ తన విధానాలను మార్చుకోవాల్సి ఉంటుందని మిస్బా సూచించారు. ఆకస్మిక మార్పులతో ఆటగాళ్లలో భయాందోళనలు పెరుగుతాయే ఒరిగేదేమీ ఉండదని, యువ ఆటగాళ్లకు ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడేలా ప్రోత్సహించాలని చెప్పారు.

# రూమర్లకు చెక్ పెట్టిన రాహుల్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 మినీ వేలానికి ముందు స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ భవితవ్యంపై నెలకొన్న ఎండ్ కార్డు పడింది. గత 2026 సీజన్ ముగిసిన నాటి నుంచి ఫ్రాంచైజీల మధ్య ఆటగాళ్ల ట్రేడింగ్ గురించి పలు రకాల ప్రచారాలు జరిగాయి. ఇప్పటికే రిషభ్ పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్ గూటికి చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వెళ్లే భారీ ట్రేడ్ అధికారికంగా స్పష్టమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో రాహుల్ కూడా వేరే ఫ్రాంచైజీలోకి వెళ్తాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే రాబోయే సీజన్‌లో తాను ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే బరిలోకి దిగుతానని రాహుల్ స్వయంగా తేల్చిచెప్పాడు. ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ సోషల్ మీడియా వేదికగా రాహుల్‌ను ప్రశంసిస్తూ పెట్టిన పోస్ట్‌తో ఈ చర్చలకు తెరపడింది. రాహుల్‌ను అత్యుత్తమ క్లచ్ ప్లేయర్‌గా అభివర్ణించిన జిందాల్, ఫ్రాంచైజీతో ఇంకా సాధించాల్సింది చాలా ఉందని రాసుకొచ్చాడు. "కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు నిజమైన ఆస్తి. జట్టు ప్రయోజనాలను ఎల్లప్పుడూ ముందుంచే వ్యక్తి. రాబోయే సీజన్‌లో ఢిల్లీని గర్వపడేలా చేయడానికి కలిసి శ్రమిస్తాం" అని జిందాల్ పేర్కొన్నాడు. దీనికి రాహుల్ స్పందిస్తూ "థ్యాంక్స్, వచ్చే సీజన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని బదులిచ్చాడు. దీంతో అతడు ఢిల్లీ క్యాపిటల్స్ జెర్సీలోనే కొనసాగుతాడన్న విషయం అధికారికంగా రూఢీ అయింది. 2025 సీజన్‌లో రూ. 14 కోట్లకు ఢిల్లీలో చేరిన రాహుల్, తొలి ఏడాది 539 రన్స్, 2026 సీజన్‌లో 593 రన్స్ చేసి అద్భుత ఫామ్ కనబరిచాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్ వ్యవహారంలో కీలక మలుపు తిరిగింది. సరైన డీల్ కుదరకపోవడంతో హార్దిక్ మరో ఏడాది పాటు ముంబై ఇండియన్స్ జట్టులోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 2027 సీజన్ కోసం జట్టు నాయకత్వంలో మార్పులు జరగనున్నాయని, కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియలో మాజీ సారథి రోహిత్ శర్మ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాడని తెలుస్తోంది. కెప్టెన్సీ కోల్పోయినప్పటికీ హార్దిక్ జట్టులో ఒక ఆటగాడిగా కొనసాగే అవకాశాలను ఫ్రాంచైజీ పరిశీలిస్తోంది. ఫ్రాంచైజీలు తమ కోర్ గ్రూప్‌ను పటిష్టం చేసుకునే క్రమంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రిషభ్ పంత్ రీఎంట్రీ, రాహుల్ కొనసాగింపుతో ఢిల్లీ క్యాపిటల్స్ మరింత బలంగా మారగా, మిగిలిన జట్లు సైతం సమతుల్యత కోసం ట్రేడింగ్ మార్గాలను అన్వేషిస్తున్నాయి.





# పట్టుబిగించిన ఈస్ట్ జోన్..

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఇషాన్ కిషన్ సారథ్యంలోని ఈస్ట్ జోన్ పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటి కొండంత స్కోర్ చేసిన ఈస్ట్ జోన్.. ఆ తర్వాత బౌలింగ్‌తో సౌత్ జోన్ పని పట్టింది. దాంతో చెన్నై వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఈస్ట్ జోన్ విజయం దిశగా దూసుకెళ్తోంది. ఈస్ట్ జోన్ బౌలర్లు మహమ్మద్ షమీ(2/17), ముఖేష్ కుమార్(2/36) నిప్పులు చెరగడంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులే చేసింది. క్రీజులో తిలక్ వర్మ(133 బంతుల్లో 5 ఫోర్లతో 56 బ్యాటింగ్), సీవీ మిలింద్(2 బ్యాటింగ్) ఉన్నారు. ఈస్ట్ జోన్ బౌలర్లలో షమీ, ముఖేష్ కుమార్‌తో పాటు ఖరైషి, శిఖర్ మోహన్ తలో వికెట్ తీసారు. సౌత్ జోన్ ఇంకా 466 పరుగుల వెనుకంజలో ఉంది. ఈస్ట్ జోన్ నిర్దేశించిన 708 పరుగుల భారీ స్కోర్‌ను అధిగమించేందుకు మూడో రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌత్ జోన్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై సౌత్ జోన్ బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. ఓపెనర్ రికీ భుయ్(1) ఆరంభంలోనే వెనుదిరగ్గా.. నారయణ్ జగదీషన్, దేవదత్ పడిక్కల్ ఆచితూచి ఆడారు. హాఫ్ సెంచరీ దిశగా సాగిన నారయణ్ జగదీషన్(32)ను శిఖర్ మోహన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. మరోవైపు షేక్ రషీద్‌తో కలిసి పడిక్కల్ 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దాంతో సౌత్ జోన్ 115/2 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే షేక్ రషీద్(27)ను మహమ్మద్ షమీ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా.. సెంచరీ దిశగా సాగిన పడిక్కల్‌ను ముఖేష్ కుమార్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో 3 పరుగుల వ్యవధిలోనే సౌత్ జోన్ రెండు వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో తిలక్ వర్మ, రవిచంద్రన్ స్మరణ్ ఆచితూచి ఆడే ప్రయత్నం చేశారు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని షమీ విడదీసాడు. రవిచంద్రన్(23) కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. అనంతరం శ్రేయస్ గోపాల్ క్రీజులోకి రాగా.. తిలక్ వర్మ ఆచితూచి ఆడటంతో సౌత్ జోన్ 176/5 టీ బ్రేక్‌కు వెళ్లింది. ఆఖరి సెషన్‌లో సమయోచితంగా బ్యాటింగ్ చేసిన ఈ జోడీ ఇన్నింగ్స్ నిలబెట్టే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో తిలక్ వర్మ 123 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆచితూచి ఆడిన శ్రేయస్ గోపాల్‌ను ఖురైషి ఔట్ చేసి ఆరో వికెట్‌కు నమోదైన 66 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. చామ మిలింద్‌తో కలిసి తిలక్ వర్మ ఒంటరి పోరాటం చేశాడు. అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో ఈస్ట్ జోన్ బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. మరో వికెట్ పోకుండా మూడో రోజు ఆటను ముగించాడు.




# నగ్నంగా నిలబెట్టేవారు..

సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్, నటి సందీపా విర్క్ తన జీవితంలో ఎదుర్కొన్న అత్యంత భయానకమైన దినాలను గుర్తుచేసుకుని తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రూ.6 కోట్ల మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి సందీపా విర్క్ దాదాపు నాలుగున్నర నెలల పాటు ఢిల్లీలోని తీహార్ జైలులో గడపాల్సి వచ్చింది. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న సందీపా విర్క్.. జైలులో తాను అనుభవించిన దారుణ పరిస్థితులను, అవమానాలను బయటపెట్టారు. జైలులో ఖైదీలను తనిఖీ చేసే పద్ధతి అత్యంత అమానుషంగా ఉంటుందని సందీపా చెప్పుకొచ్చారు. లోపలికి వెళ్లగానే సిబ్బంది బట్టలు విప్పించి ప్రైవేట్ పార్టులపై టార్చ్ లైట్ వేసి తనిఖీ చేస్తారని.. చలికాలంలోనూ ఇష్టారీతిన దుస్తులు తొలగించి అవమానిస్తారని వాపోయారు. ఇంత కఠినంగా శరీరాన్ని తనిఖీ చేస్తున్నప్పుడు జైలు లోపలికి మొబైల్ ఫోన్లు, డ్రగ్స్ ఎలా వస్తున్నాయని ఆమె ప్రశ్నించారు. జైలులో డబ్బు ఉంటే ఏదైనా సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక రోజులోనే రెండు మూడు సార్లు దుస్తులు ఊడదీసి తనిఖీలు చేసేవారని.. ఆ వందలాది తనిఖీల సమయంలో తాను తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని సందీపా విర్క్ వెల్లడించారు. "మహిళా సిబ్బందే కదా చూస్తోంది, దుస్తులు తీస్తే తప్పేంటి?" అని కొందరు తేలికగా మాట్లాడుతున్నారని సందీపా విర్క్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా జైలులోని ఆహారం, టాయిలెట్లు అత్యంత అపరిశుభ్రంగా ఉండేవని.. మొదటిరోజే తనను 25-26 మంది ఉన్న గదిలో నెట్టివేశారని సందీపా విర్క్ గుర్తుచేసుకున్నారు. నిరంతం జరిగిన మానసిక వేధింపులు, ఒత్తిడి తట్టుకోలేక తాను జైలులో ఉన్న సమయంలో ఆత్మహత్య చేసుకోవాలని కూడా భావించినట్లు కన్నీటిపర్యంతమయ్యారు.

# మోక్షజ్ఞ బర్త్ డేకి ఫ్యాన్స్‌కి ట్రీట్..

గోపీచంద్ మలినేని దర్శకత్వంలో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తోన్న ఎన్‌బీకే 111 మూవీకి సంబంధించి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. గత కొంతకాలంగా ఎన్‌బీకే 111 వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు తాజాగా టైటిల్ ఖరారు చేశారు. బాలయ్య కుమారుడు నందమూరి మోక్షజ్ఞ తేజ పుట్టినరోజును పురస్కరించుకుని టైటిల్‌ను రివీల్ చేశారు. బాలయ్య - గోపీచంద్ మలినేని మూవీకి దాదా అనే టైటిల్‌ను కన్ఫర్మ్ చేస్తూ మేకర్స్ పోస్టర్ విడుదల చేశారు. దీనికి సంబంధించి పోస్ట్ వైరల్ అవుతోంది. వీరశివారెడ్డి వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నందమూరి బాలకృష్ణ- గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ కావడంతో ఎన్‌బీకే 111పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటి వరకు ఈ సినిమాకు టైటిల్ ఏంటన్నది మాత్రం నిర్మాతలు ప్రకటించలేదు. అయితే అభిమానుల ఎదురుచూపులకు తెరదించుతూ.. సెప్టెంబర్ 6వ తేదీన ఎన్‌బీకే 111 టైటిల్‌ను రివీల్ చేశారు. ఈ మేరకు దాదా పేరుతో టైటిల్ గ్లింప్స్ విడుదల చేశారు. బాలయ్య స్టైలిష్‌గా ఎంట్రీ ఇచ్చారు. సూపర్‌స్టార్ కృష్ణ హిట్ మూవీ అగ్నిపర్వతంలోని పాపులర్ డైలాగ్ అగ్గి పెట్టుందా అని అడుగుతూ పూనకాలు తెప్పించారు బాలయ్య. అరేయ్ ఏరే.. నాకు గురిపెట్టడానికి ఒంటిలో పొగరు, వేలికి ట్రిగ్గరు ఉంటే సరిపోదు, బుల్లెట్స్‌కి బలుపుండాలి, గన్స్‌కి గట్స్ ఉండాలి అంటూ తన మార్క్ పంచ్ డైలాగ్‌తో అభిమానులను అలరించారు. దాదాలో బాలయ్య సరసన కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలయ్యను ఢీకొట్టే పవర్‌ఫుల్ విలన్‌గా హీరో మంచు మనోజ్ కనిపించనున్నారు. మిగిలిన నటీనటుల వివరాలు తెలియాల్సి ఉంది. ఇటీవల పెద్దితో మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ప్రముఖ నిర్మాత వెంకట సతీశ్ కిలారు తన వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై దాదా సినిమాను నిర్మిస్తున్నారు. బాలయ్య ఫేవరెట్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తుండగా.. కాంతార ఫేమ్ అరవింద్ ఎస్ కశ్యప్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. బుర్రా సాయి మాధవ్ తన మార్క్ పంచ్ డైలాగులను రాస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న దాదా విడుదల కానుందని మేకర్స్ ప్రకటించారు. దాదా సినిమా షూటింగ్ సమయంలో నందమూరి బాలకృష్ణకు గాయం కావడంతో ఆయన ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన కోలుకోవడంతో వచ్చే నెల నుంచి షూటింగ్‌ను తిరిగి ప్రారంభించి.. నాన్‌స్టాప్ షెడ్యూల్స్‌తో శరవేగంగా కంప్లీట్ చేయాలని గోపీచంద్ మలినేని భావిస్తున్నారు. షూటింగ్‌కు 2 నెలలే సమయం ఉండటంతో దానికి తగిన విధంగా షూటింగ్ ప్లాన్ చేస్తున్నారని సినీ వర్గాలు తెలిపాయి.




# 'ఫౌజీ' సెట్‌లో ప్రమాదం జరగలేదు




ఇండియాస్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా 'సీతా రామం' వంటి విజయం తర్వాత హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న సినిమా 'ఫౌజీ' . ఆల్రెడీ విడుదలైన ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. సినిమాపై పాజిటివ్ బజ్ నెలకొంది. అది పక్కన పెడితే... కొన్ని నెలల క్రితం ఈ సినిమా షూటింగ్ చేసేటప్పుడు బాలీవుడ్ నటుడు రాజేష్ శర్మను ఓ కీటకం (విష పురుగు) కుట్టడంతో అనారోగ్యానికి గురి అయ్యారని, ఆయన ఆసుపత్రి పాలయ్యారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. ఆ వార్తల్లో నిజం లేదని ఆయన క్లారిటీ ఇచ్చారు. అసలు నిజాలను బయట పెట్టారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రభాస్ సినిమా 'ఫౌజీ' షూటింగ్ పూర్తి చేసుకుని దట్టమైన చెట్ల మధ్య టెక్నీషియన్లతో రాజేష్ శర్మ మాట్లాడుతున్న సమయంలో ఆయన్ను ఓ కీటకం కుట్టిందని జూలై నెలలో బెంగాలీ యాక్టర్ సుదీప ఛటర్జీ తెలిపారు. అప్పట్లో అది పెద్ద సమస్యగా అనిపించలేదని, దాంతో రాజేష్ శర్మ నిర్లక్ష్యం చేశారని పేర్కొన్నారు. చిత్రీకరణ ముగిసిన ఆరు గంటలకు కాలులో తీవ్రమైన నొప్పి కలగడంతో కోల్‌కతాకు ప్రయాణిస్తున్న విమానంలో రాజేష్ శర్మకు విపరీతమైన జ్వరం వచ్చిందని, పరిస్థితి విషమించడంతో కోల్‌కతాలోని మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించినట్లు సుదీప ఛటర్జీ వివరించారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన ఆరోగ్యంపై జరిగిన ప్రచారాన్ని రాజేష్ శర్మ ఖండించారు. తాను 'ఫౌజీ' సెట్స్‌లో అనారోగ్యానికి గురైనట్లు వచ్చిన వార్తల్లో అసలు నిజం లేదని ఆయన తెలిపారు. ఆ అంశం గురించి రాజేష్ శర్మ మాట్లాడుతూ... "అది ముమ్మాటికీ అబద్ధమే. ప్రభాస్ 'ఫౌజీ' సినిమా సెట్స్‌లో నాకు ఏం జరగలేదు. నేను అనారోగ్యానికి గురి కావడం వెనుక ప్రభాస్ కానీ, ఆయన సినిమా యూనిట్ కానీ ఎంత మాత్రం బాధ్యులు కారు. వాళ్ళందరూ మంచి వ్యక్తులు" అని చెప్పారు. హైదరాబాద్‌లో షూటింగ్ చేసిన సమయంలో తనకు ఎటువంటి ఇబ్బంది తలెత్తలేదని, కోల్‌కతాకు వచ్చిన ఒకట్రెండు రోజుల తర్వాతే పరిస్థితి విషమించిందని... తీవ్రంగా మారిందని రాజేష్ శర్మ వివరించారు. తాను అనారోగ్యానికి గురి కావడానికి అసలు కారణం పురుగు కుట్టడం కాదని, తన కుడి కాలును చాలా కాలంగా ఇబ్బంది పెడుతున్న చర్మ సంబంధిత సమస్య అని, దాని కారణంగా ఇన్‌ఫెక్షన్ సోకిందని రాజేష్ శర్మ వెల్లడించారు. తనకు షుగర్ (డయాబెటిస్) ఎక్కువగా ఉండటం, సమస్యను ప్రారంభంలో పట్టించుకోకపోవడం వల్ల ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువైందని ఆయన వివరించారు. సుదీప తనకు ఫ్రెండ్ అని, తప్పుడు సమాచారం అందడంతో అలా చెప్పారని పేర్కొన్నారు. అదీ సంగతి. ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని రాజేష్ శర్మ తెలిపారు. మరో వారంలో తిరిగి షూటింగ్లు చేయడం స్టార్ట్ చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఢిల్లీకి వీడ్కోలు

**జాతీయ చలనచిత్ర అవార్డుల వేదికలో కీలక మార్పు**

**దేశవ్యాప్తంగా అవార్డుల నిర్వహణ**

**గుజరాత్‌లో 72వ అవార్డుల వేడుక**

**రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాలు**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్):** జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవ వేదిక విషయంలో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. దశాబ్దాలుగా ఢిల్లీకే పరిమితమైన ఈ ప్రతిష్టాత్మక వేడుకను ఇకపై ప్రతి సంవత్సరం దేశంలోని వేర్వేరు ప్రాంతాలలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని చాటేందుకు ఈ మార్పు చేసినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవాన్ని సెప్టెంబర్ 22న గుజరాత్‌లోని ఏక్తా నగర్ (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణం) లో వైభవంగా నిర్వహించనున్నారు. సాంప్రదాయబద్ధంగా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే ఈ వేడుకను ఇతర ప్రాంతానికి మార్చడం ఇదే తొలిసారి. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ చిత్రంగా 'ఆర్టికల్ 370', ఉత్తమ నటిగా యామీ గౌతమ్ నిలవగా, మమ్ముట్టి మరియు కార్తీక్ ఆర్యన్ సంయుక్తంగా ఉత్తమ నటుడు పురస్కారాన్ని దక్కించుకున్నారు. అలాగే నాన్-ఫీచర్ విభాగంలో ఆనంద్ ఎల్ రాయ్ ఉత్తమ దర్శకుడిగా ఎంపికయ్యారు. సెప్టెంబర్ 22న గుజరాత్‌లో జరగనున్న ఈ ప్రత్యేక వేడుకలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు పురస్కారాలను అందజేయనున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# దళిత, ఆదివాసీల హక్కుల కోసం సమష్టి పోరాటం

- **బీజేపీ సర్కారుది సవతి తల్లి వైఖరి**
- **పార్లమెంట్‌లోనూ.. ప్రజల మధ్యకూ వెళ్లి పోరాడతాం... ఎంపీ డా.కడియం కావ్య**



**వరంగల్, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్) :** దళితులు, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్ల మెంట్‌లోనూ, వెలుపలా సమష్టిగా పోరాటం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎంపీలు నిర్ణయించినట్లు వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య తెలిపారు. న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. దళితులు, ఆదివాసీలపై దాడులు పెరుగుతున్నప్పటికీ వారి సంక్షేమానికి కేటాయించే నిధులను తగ్గించడం ఆందోళనకరమన్నారు. ఎస్సీ, ఎస్టీల పట్ల ఎన్డీ ఏ ప్రభుత్వం సవతి తల్లి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలను పార్ల మెంట్‌లో మరింత బలంగా లేవనెత్తుతామని చెప్పారు. అవసరమైతే ప్రజల మధ్యకు వెళ్లి హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

**హల్ద్వానీ ఘటనపై తీవ్ర ఆగ్రహం...**

మల్లి కార్జున ఖర్గే పర్యటన అనంతరం హల్ద్వానీలో చోటుచేసుకున్నట్లు వెల్లడైన 'శుద్ధీకరణ' ఘటనను సమావేశం తీవ్రంగా ఖండించింది. ఇటువంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా.. సమానత్వం, గౌరవం, అంటరానితనం నిర్మూలన వంటి రాజ్యాంగ విలువలకు విరుద్ధమని డా. కడియం కావ్య అన్నారు.ఘటనకు బాధ్యులపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆర్ఎస్ఎస్, ఇతర మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి సంయుక్తంగా వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. దళితులు, ఆదివాసీల గౌరవం, హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎస్సీ, ఎస్టీ ఎంపీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని డా. కడియం కావ్య పిలుపునిచ్చారు.

# ఓబీసీ కాలమ్ కోసం.. బహుజన సమరశంఖం

- **దశాబ్దాల సామాజిక అన్యాయానికి ముగింపు పలకాలి**
- **జనాభాలో మేమెంతో.. హక్కుల్లో మాకెంత?**
- **ఓబీసీ గణనతోనే సామాజిక న్యాయానికి బాట**
- **లెక్కల్లో కనిపించని బహుజనులు.. హక్కుల్లో భాగస్వామ్యం ఎలా?**



**తాడిశెట్టి క్రాంతికుమార్‌ఫౌండర్ & చైర్మన్, తెలంగాణ బీసీ మహాసేన**

**హన్మకొండ, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్) :** దేశ జనాభాలో గణనీయమైన భాగంగా ఉన్న బీసీ, ఓబీసీ వర్గాల సామాజిక, విద్యా, ఆర్థిక స్థితిగతులను శాస్త్రీయంగా అంచనా వేయాలంటే కచ్చితమైన జనాభా గణాంకాలు అత్యవసరం. అందుకే రాబోయే జాతీయ జనాభా లెక్కల్లో బీసీ, ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రాధాన్యం సంతరించుకుంది. 1931లో జరిగిన సమగ్ర కుల గణన తర్వాత బీసీల జనాభాకు సంబంధించి దేశవ్యాప్తంగా సమగ్ర అధికారిక గణాంకాలు అందుబాటులో లేవన్నది ఈ చర్చలో ప్రధాన అంశం. ప్రతి పదేళ్లకు జనాభా లెక్కలు నిర్వహించే ప్రక్రియలో బీసీల జనాభా వివరాలను కూడా శాస్త్రీయంగా నమోదు చేయాలని బీసీ సంఘాలు చాలాకాలంగా కోరుతున్నాయి.

**గణాంకాలు లేకుండా విధానాలు ఎలా?...**

బీసీల సామాజిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేసేందుకు కాకా కలేల్కర్ కమిషన్, బి.పి. మండల్ కమిషన్ వంటి కమిషన్లు పనిచేశాయి. బీసీలలోని వివిధ వర్గాల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు జస్టిస్ రోహిణి కమిషన్ కూడా ఏర్పాటు చేయబడింది. అయితే కచ్చితమైన జనాభా గణాంకాలు అందుబాటులో లేకుండా రిజర్వేషన్ల విధానం, వర్గీకరణ, సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన శాస్త్రీయ ప్రాతిపదికను ఎలా నిర్ణయించాలన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. బీసీల జనాభా, వారి సామాజిక-ఆర్థిక స్థితిగతులపై కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉంటేనే ప్రభుత్వ విధానాలను మరింత సమర్థంగా రూపొందించేందుకు అవకాశం ఉంటుంది. జనాభా దామాషా, వెనుకబాటుతనం, విద్యా అవకాశాలు, ఉపాధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఓబీసీ కాలమ్ ఎందుకు అవసరం?...**

జనాభా లెక్కల్లో ఓబీసీ వివరాల నమోదుకు సాంకేతిక సమస్యలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అయితే వివిధ రాష్ట్రాల్లో ఒకే సామాజిక వర్గానికి వేర్వేరు పేర్లు ఉండటం వల్ల డేటా సేకరణలో సమస్యలు ఎదురైతే, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ సమస్యకు పరిష్కారం కనుగొనవచ్చు. ప్రతి కులానికి ప్రత్యేకమైన 'యూనిక్ కోడ్' లేదా గుర్తింపు సంఖ్యను కేటాయించి, రాష్ట్రాలవారీగా ఉన్న పేర్లను ఒకే డేటాబేస్‌కు అనుసంధానం చేయవచ్చు. తద్వారా సమాచార సేకరణ మరింత సులభతరం అవుతుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ప్రస్తుత కాలంలో ఈ అంశంపై నిపుణులతో చర్చించి ఆచరణ సాధ్యమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

**తెలంగాణలో కొనసాగుతున్న ఉద్యమం...**

బీసీల హక్కుల సాధన కోసం తెలంగాణలో వివిధ బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు కొంతకాలంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నాయి. తెలంగాణ బీసీ మహాసేన ఆధ్వర్యంలోనూ సభలు, సమావేశాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బీసీ సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. బీసీలకు సంబంధించిన జనాభా గణాంకాలు, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు వంటి అంశాలపై సమగ్ర చర్చ అవసరం. ఈ అంశాలను కేవలం రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయం, సమాన అవకాశాల దృష్టితో పరిశీలించాలి. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో చేసిన ఎన్నికల హామీల్లో బీసీ కులగణన, జనాభా దామాషా ప్రకారం నిధులు, రిజర్వేషన్ల పెంపు వంటి అంశాలను ప్రస్తావించింది. రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు కావడంతో పాటు, జాతీయ స్థాయిలోనూ బీసీలకు సంబంధించిన కచ్చితమైన గణాంకాల సేకరణకు కేంద్రం చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాలు కోరుతున్నాయి.

**రాజకీయాలకు అతీతంగా ఉమ్మడి పోరాటం...**

బీసీ కులగణన అంశం ఒక రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, సామాజిక న్యాయానికి సంబంధించినదని గుర్తించాల్సిన అవసరం ఉంది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ అంశంపై తమ వైఖరిని స్పష్టం చేయాలి. పార్ల మెంట్, రాష్ట్ర శాసనసభల్లో బీసీ జనాభా గణన అవసరంపై చర్చ జరగాలి. అవసరమైన తీర్మానాలు, విధానపరమైన ప్రతిపాదనలు ముందుకు తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. వివిధ బీసీ సంఘాలు, మేధావులు, ప్రజా ప్రతినిధులు ఒక వేదికపైకి వచ్చి నిర్మాణాత్మకంగా చర్చించాల్సిన సమయం ఇది.

**ఇది భవిష్యత్ తరాల ప్రశ్న...**

జనాభా లెక్కల్లో బీసీల వివరాలు నమోదుకాకపోతే మరోసారి సమగ్ర గణాంకాల కోసం దీర్ఘకాలం వేచి చూడాల్సి రావచ్చు. అందువల్ల రాబోయే జనాభా లెక్కల ప్రక్రియలోనే ఓబీసీ వివరాలను శాస్త్రీయంగా నమోదు చేసే విధానాన్ని రూపొందించాలనే డిమాండ్ ముందుకు వస్తోంది. బీసీ సోదర, సోదరీమణులు తమ హక్కులు, ప్రభుత్వ విధానాలు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి. బీసీ మేధావులు నిర్వహించే సెమినార్లు, సభలు, సమావేశాల్లో పాల్గొని సమస్యలను అర్థం చేసుకోవాలి. సమాచారం తెలుసుకోవడం, ప్రశ్నించడం, ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ హక్కుల కోసం గొంతెత్తడం ప్రతి పౌరుడి హక్కు. కచ్చితమైన గణాంకాలే సమర్థవంతమైన విధానాలకు పునాది. సామాజిక న్యాయం కోసం బీసీల జనాభా గణనపై సమగ్ర చర్చ జరగాలి. రాబోయే జనాభా లెక్కల్లో ఓబీసీ వివరాల నమోదుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని కొనసాగిద్దాం. బీసీల హక్కుల కోసం ఐక్యంగా, నిర్మాణాత్మకంగా ముందుకు సాగుదాం.

# వలిగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ




**వలిగొండ సెప్టెంబర్ 08 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామపంచాయతీ పరిధిలో VB-G RAM G ఎజెండాతో గ్రామ సభ నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామపంచాయతీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తులతో చర్చించారు. ఈ గ్రామ సభకు మండల పరిషత్తు అభివృద్ధి అధికారి జి. జలంధర్ రెడ్డి, గ్రామపంచాయతీ సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య నాయక్, ఏపీవో పరశురాములు, అసిస్టెంట్ ఇంజనీర్ హౌసింగ్ కిరణ్, ఈసీ, గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్, వార్డు సభ్యులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు హాజరయ్యారు. గ్రామ సభ ద్వారా గ్రామ ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల మెరుగుదల, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై తమ అభిప్రాయాలను తెలియజేసే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. గ్రామ సభలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల సూచనలు, అవసరాలకు అనుగుణంగా గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని అధికారులు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజలు అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అనంతరం వలిగొండ మండల తహశీల్దార్ దశరథ నాయక్ గ్రామ సభలో పాల్గొని సర్ స్పెషల్ ఇంటెన్సు రివిజన్ ప్రక్రియపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.సర్ ప్రక్రియకు సంబంధించిన విధి విధానాలు, ప్రయోజనాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా సర్ కు సంబంధించి ప్రజల్లో ఉన్న పలు అపోహలు, వాస్తవాలను స్పష్టంగా వివరించి, ప్రక్రియపై ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉన్నట్లయితే వాటిని సరిచేసుకునేందుకు తమకు కేటాయించిన బూత్ లెవల్ అధికారిలను సంప్రదించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని ఎంఆర్ఓ గ్రామస్తులకు సూచించారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేందుకు ఓటరు జాబితాలో తన పేరు వివరాలు సరిగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని అధికారులు తెలిపారు. ప్రజలు చురుకుగా పాల్గొని గ్రామ సభలను విజయవంతం చేయడం ద్వారా గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## గణేష్ మండప నిర్వాహకులకు సూచనలు

**జారీ చేసిన వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి.**



**వలిగొండ సెప్టెంబర్ 08 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని వినాయక చవితి పండుగను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు మరియు ఇతర ప్రభుత్వ శాఖల ముందస్తు అనుమతులు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రత దృష్ట్యా పలు సూచనలు జారీ చేశారు.

**ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన ముఖ్యమైన నిబంధనలు**

ముందస్తు అనుమతి తప్పనిసరి. గణేష్ మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖ, మరియు మున్సిపల్/గ్రామ పంచాయతీ అధికారుల నుండి ముందస్తు అనుమతి పత్రాలను పొందాలి. ట్రాఫిక్కు అంతరాయం కలగవద్దు: రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది కలిగేలా, వాహనాల రాకపోకలను అడ్డుకునేలా మండపాలను ఏర్పాటు చేయకూడదు.డీజేలపై నిషేధం ధ్వని కాలుష్యం: రాత్రి వేళల్లో సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయం దాటిన తర్వాత మైకులు, ధ్వని కాలుష్య కారక పరికరాలను వాడకూడదు. డీజేల వాడకంపై కఠిన నిబంధనలు వర్తిస్తాయి. భద్రతా చర్యలు & సీసీ కెమెరాలు ప్రతి మండపం వద్ద నిర్వాహకులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. రాత్రి వేళల్లో మండపం వద్ద కనీసం ఇద్దరు లేదా ముగ్గురు నిర్వాహకులు తప్పనిసరిగా కాపలా ఉండాలి. పోలీస్ స్టేషన్ నుండి తప్పకుండా అనుమతులు తీసుకోవాలని సబ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. శోభయాత్ర సమయములో ఎవరైనా శాంతి భద్రతలకి విఘాతం కలిగించినట్లయితే చట్టపరముగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

## గణేష్ ఉత్సవాలు శాంతియుత నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి:

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS.**
- **నేటి నుండి నిమజ్జనం వరకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టా లి.**



**నారాయణపేట, సెప్టెంబర్,08(సమయం న్యూస్)**వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు అధికారులతో ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ప్రత్యేక సమావేశం నిర్వహించి ఉత్సవాలు సజావుగా జరిగేందుకు భద్రత పరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలు 14.09.2026 నుండి 25.09.2026 వరకు కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజల భద్రత, రక్షణ ముందు నుంచే పోలీస్ అధికారులు పటిష్టమైన ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఎస్పీ సూచించారు. ముందుగా మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, గణేష్ మండపాల నిర్వాహకులతో శాంతి సమావేశాలు నిర్వహించాలి. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి ఉత్సవాల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాల నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటు వివరాలను తప్పనిసరిగా పోలీసులకు ఇన్ఫర్మేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగే విధంగా ప్రధాన రహదారులు, రోడ్లపై మండపాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకూడదు.నిబంధనలకు విరుద్ధంగా డీజేలకు అనుమతి ఇవ్వకూడదు. రౌడీషీటర్లు, కమ్యూనల్ షీటర్ల ను మండలాల వారిగా బండోవర్ చేయాలని మరియు ఇతర సమస్యాత్మక వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలి. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు తగిన భద్రతా చర్యలు చేపట్టేలా అవగాహన కల్పించాలి. గణేష్ విగ్రహాలకు జియో ట్యాగింగ్ చేయాలి. నిమజ్జనం జరిగే రూట్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ ప్రతి రోజు గ్రామాలలో పర్యటించి ఆర్గనైజర్స్ తో మాట్లాడుతూ వారితో వాట్స్ అప్ గ్రూప్ ఏర్పాటు చేసి వారికి సూచనలు చేయాలి. వీధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరిరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలతో మర్యాదగా ఉండాలని ఎవరి పైన అనుచితంగా ప్రవర్తించరాదు అని తెలిపారు. జిల్లా పరిధిలో సోషల్ మీడియా పై పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేయాలి అని సూచించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఉత్సవాలు జరిగే విధంగా తగిన చర్యలు తీసుకొని శాంతి భద్రతలు పరిరక్షించాలి అలాగే ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ అల్ల ర్లుసృష్టించాలని చూస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎం.డి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు మహేష్, నల్లపు లింగయ్య,సీఐ శివ శంకర్, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, RI విజయ్ భాస్కర్, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, పురుషోత్తం, భాగ్యలక్ష్మి రెడ్డి, విజయ్ భాస్కర్, రాజు, అశోక్ బాబు, చంద్ర శేఖర్, ఎస్.ఎం నవీద్, గాయత్రి, మహేశ్వరి, కృష్ణ చైతన్య, శ్వేత, శిరీష, బాలరాజు తది తరులు పాల్గొన్నారు.

## సింగీతం గ్రామంలో ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

**సంగారెడ్డి సెప్టెంబర్ 08 (సమయం న్యూస్)** రాయికోడ్ మండలం సింగీతం గ్రామంలో గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో గ్రామ ప్రజలందరూ ఉండాలని పోచమ్మ తల్లిని ప్రార్థించారు.

## ప్రజాస్వామ్య విలువలను కాపాడే బాధ్యత యువతదే

### విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలి... విష్ణు రెడ్డి



**వరంగల్/బొల్లికుంట, సెప్టెంబర్ 8 (సమయం న్యూస్)** : ప్రజాస్వామ్య వ్యవస్థపై యువతకు అవగాహన కల్పించడంతోపాటు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు మోడల్ యునైటెడ్ నేషన్స్ (MUN), మాక్ అసెంబ్లీ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని యువ నాయకుడు విష్ణు రెడ్డి అన్నారు. బొల్లికుంటలోని వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన VAGMUN (Vaagdevi Model United Nations), తెలంగాణ స్టేట్ మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆయన హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజా సమస్యలపై లోతుగా అధ్యయనం చేసి, వాటిపై బాధ్యతాయుతంగా చర్చించడం, భిన్నాభిప్రాయాలను గౌరవించడం వంటి ప్రజాస్వామ్య విలువలను విద్యార్థు లు చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. చర్చలు, వాదోపవాదాల ద్వారా విషయాలను వివిధ కోణాల్లో విశ్లేషించే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సమాజంలో నెలకొన్న సమస్యలపై అవగాహన పెంచుకుని, వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషించే దృక్పథాన్ని యువత అలవర్చుకోవాలని విష్ణు రెడ్డి సూచించారు. విద్య, వైద్యం, ఉపాధి, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు వంటి కీలక అంశాలపై యువత చైతన్యంతో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందని, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థు లు తదితరులు పాల్గొన్నారు.

## సింగీతం ZPHSకు వాటర్ ప్యూరిఫైయర్ అందించిన రిటైర్డ్ టీచర్ ఆర్. కిష్టయ్య



**సంగారెడ్డి సెప్టెంబర్ 08 (సమయం న్యూస్)** సెప్టెంబర్ 8: విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందాలనే సేవా సంకల్పంతో రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీ ఆర్. కిష్టయ్య గారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగీతం కు ఆధునిక మంచినీటి వాటర్ ప్యూరిఫైయర్ అందజేశారు. ఈ సేవా కార్యక్రమం పాఠశాలలో ఆత్మీయ వాతావరణంలో జరిగింది.ఈ కార్యక్రమంలో MEO నర్సింలు సార్ గారు,మాజీ ఎంపీటీసీ నిరంజన్ గారు, మాజీ సర్పంచ్ అంబన్న గారు, ప్రధానోపాధ్యాయులు శివకుమార్ గారు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లేశం గారు, ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం, పాండు తదితరులు పాల్గొని కిష్టయ్య ను ఘనంగా అభినందించారు.

## గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ...



**శంషాబాద్ సమయం సెప్టెంబర్ 8:** శంషాబాద్ మండలం మదనపల్లి కొత్త తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ ఉప సర్పంచ్ కలిసి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఇటీవల వార్డు సభ్యులు జిల్లా కలెక్టర్ తో పాటు డిపిఓ కు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు మంగళవారం శంషాబాద్ ఎంపీఓ రమేష్ గ్రామపంచాయతీకి చేరుకొని సర్పంచ్ ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి తో పాటు వార్డు సభ్యుల సమక్షంలో క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేస్తున్నట్లు ఎంపీ ఓ తెలిపారు. గ్రామపంచాయతీలోని పలు రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్లు ఫామ్ హౌస్ లో నిర్మించుకున్న వాటికి ఇంటి నంబర్లు కేటాయిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు వార్డు సభ్యులు ఎంపీవ దృష్టి కి తీసుకువచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి అంశంపై విచారణ చేసి ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తానని ఎంపీ ఓ మీడియాకు వివరించారు.

**సర్పంచ్ భర్త ఆగడాలను అరికట్టాలి**

శంషాబాద్ మండలం మదనపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచి భర్త ఆగడాలను అరికట్టాలని మాజీ సర్పంచ్ దేవా నాయక్ వార్డు సభ్యులు రాందాస్, భాస్కర్, బాబు, మీడియాకు వివరించారు గ్రామపంచాయతీలో సర్పంచ్ ఉపసర్పంచ్ పంచాయతీ కార్యదర్శి కలసి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతూ పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయడం లేదని తెలిపారు. దీనితో తాము జిల్లా కలెక్టర్ డీపీఓ తో పాటు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో మంగళవారం విచారణ చేసినట్లు వివరించారు. సర్పంచ్ భర్త ఆగడాలపై విచారణలో తాము పలు కీలక ఆధారాలు అధికారికి సమర్పించినట్లు తెలిపారు.

# రాజ్యాంగ పదవిని అవమానిస్తే సహించం..

- **తాతా మధుపై చర్యలు తీసుకోవాలి...డిసిసి అధ్యక్షులు మహమ్మద్ అయూబ్**
- **స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ ధర్నా**



**వరంగల్, సెప్టెంబరు 8 (సమయం న్యూస్) :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ గ్రేటర్ వరంగల్ 15, 17 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గొర్రెకుంట క్రాస్‌రోడ్డులో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పాల్గొని నిరసన తెలిపారు. పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తాతా మధు వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ తెలంగాణ శాసనసభ స్పీకర్ పదవి అత్యున్నత రాజ్యాంగబద్ధమైనదని, అటువంటి పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్‌పై తాతా మధు చేసినట్లు పేర్కొంటున్న వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలను అవమానించేలా ఉన్నాయని అన్నారు. రాజకీయపరమైన విమర్శలు చేయడంలో తప్పులేదని, అయితే రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తిపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదని పేర్కొన్నారు

తాతా మధు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు, తెలంగాణ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ లో సభాపతి పదవికి ఉన్న గౌరవాన్ని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు.

**రాజ్యాంగ విలువలను కాపాడుతాం...**

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉండే వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని అయూబ్ స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య వ్యవస్థ గౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని అన్నారు. స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరూ వ్యవహరించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో 15, 17 డివిజన్ల అధ్యక్షులు కందుల అశోక్, పసునూరి శ్రవణ్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమురారెడ్డి, ప్రధాన కార్యదర్శి సంపత్, ఆయా డివిజన్ల కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తిలో ఎక్స్ ప్రెస్ బస్సులు ఆపాల్సిందే...

- **బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా.. ఉద్యమం ఉధృతం చేస్తాం... గంట రవికుమార్**

**హసన్‌పర్తి, సెప్టెంబరు 8 (సమయం న్యూస్) :** విద్యార్థులు, ఉద్యోగులు, నిత్యం ప్రయాణించే ప్రజల సౌకర్యార్థం హసన్‌పర్తి జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం మహాధర్నా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు గురుమూర్తి శివకుమార్, హసన్‌పర్తి మండల అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ హసన్‌పర్తి మీదుగా వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ బస్సులు ఇక్కడ నిలవకపోవడంతో వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్య పరిష్కారం కోసం ఆర్టీసీ డిపో, రీజినల్ మేనేజర్లకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సైతం సమస్యను పలుమార్లు వివరించి విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజల కనీస అవసరాలు, సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. హసన్‌పర్తి జంక్షన్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిచేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. సమస్యను




పరిష్కరించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో బీజేపీ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చాడ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జలగం రంజిత్‌రావు, జనగామ జిల్లా కిసాన్ మోర్చా ఇన్‌చార్జి ముత్తిరెడ్డి కేశవరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాంచందర్‌రెడ్డి, పెంబర్తి సర్పంచ్ కుమారస్వామి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మండల నాయకులు సారంగపాణి, పిట్టల కుమారస్వామి, చకిలం రాజేశ్వరరావు, పబ్బా ఉమాదేవి, పెద్దమ్మ శ్రీనివాసు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దోమ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS






**దోమ మండలం, సెప్టెంబర్,08(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS మంగళవారం దోమ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి శాంతిభద్రతలు, పోలీస్ సిబ్బంది పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి మరియు పెండింగ్ కేసులను సమీక్షించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. CCTNS 3.0 అమలు, పెండెన్సీ, మాడ్యూళ్ల వినియోగం, రికార్డుల నవీకరణను సమీక్షించి, నిర్దేశిత గడువులోగా కంప్లయన్స్ పూర్తి చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో డ్రగ్ ట్రాఫికింగ్‌పై కఠిన చర్యలు, NDPS కేసుల దర్యాప్తు, నివారణ మరియు అవగాహన కార్యక్రమాలను ముమ్మరం చేయాలని ఆదేశించారు.సైబర్ నేరాల నమోదు, దర్యాప్తు, పరిష్కారం, సైబర్ మోసాలపై తక్షణ స్పందన, సైబర్ హెల్ప్ డెస్క్‌ల పనితీరును సమీక్షించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు మరియు నివారణ చర్యలపై దృష్టి సారించాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రత, మహిళా హెల్ప్ డెస్క్‌ల పనితీరు, బాధితుల సహాయ సేవలను సమీక్షించారు. TGCOPs అప్లికేషన్‌ను సమర్థవంతంగా వినియోగించి రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు.

CCTV నిఘా వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించి, అవసరమైన సందర్భాల్లో ఫుటేజ్‌ను దర్యాప్తులో ఉపయోగించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, నేర నియంత్రణకు రాత్రి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని,ఉన్నతాధికారుల ఆదేశాలను తూచ తప్పకుండా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి, దోమ ఎస్ఐ వసంత్ జాదవ్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా పోలీసుల ఆత్మ గౌరవాన్ని కాపాడాలి...

- **అసెంబ్లీ వద్ద ఘటనపై జాతీయ మహిళా కమిషన్ కు ఎంపీ డా.'కడియం కావ్య' ఫిర్యాదు**

**హనుమకొండ, సెప్టెంబరు 8 (సమయం న్యూస్) :** తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణం వద్ద మహిళా పోలీసుల పట్ల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వ్యవహరించిన తీరుపై వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సెప్టెంబరు 7న గేట్ నంబరు 3 వద్ద చోటుచేసుకున్న ఘటనపై జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ)కు ఆమె ఫిర్యాదు చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీసుల గౌరవం, భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**నిరసన పేరుతో అవమానిస్తారా?...**



అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని కడియం కావ్య పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ.. విధుల్లో ఉన్న మహిళా పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించడం, అవమానకర వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. మహిళా పోలీసులను ఉద్దేశించి అసభ్యకర, లింగ వివక్షతో కూడిన వ్యాఖ్యలు చేసినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు బీఆర్ఎస్ నేతలు చొక్కాలు విప్పి బనియన్లతో మహిళా పోలీసులకు సమీపంలో నిలబడటం, భద్రతా వలయాన్ని ఛేదించే క్రమంలో తోపులాట చోటుచేసుకోవడం ఆందోళనకరమని తెలిపారు.

**మహిళల ఆత్మగౌరవంతో ఆటలా?....**

మహిళల గౌరవం, ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే సమాజానికి ఎలాంటి సందేశం వెళ్తుందని ఎంపీ ప్రశ్నించారు. మహిళా పోలీసుల పట్ల జరిగినట్లు పేర్కొంటున్న దురుసు ప్రవర్తనను కేవలం రాజకీయ అంశంగా కాకుండా మహిళల గౌరవం, హక్కులకు సంబంధించిన తీవ్రమైన అంశంగా పరిగణించాలని ఎన్‌సీడబ్ల్యూను కోరారు.

**సుమోటోగా స్పందించాలి...**

మీడియాలో ప్రసారమైన కథనాలు, వీడియో ఆధారాలు, అధికారిక సమాచారాన్ని పరిశీలించి జాతీయ మహిళా కమిషన్ సుమోటోగా స్పందించాలని కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టేందుకు తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సంబంధిత ప్రజాప్రతినిధులను కమిషన్ ఎదుట హాజరుపరిచి వివరణ తీసుకోవాలని సూచించారు. రాజకీయ నిరసనలు, ఆందోళనల సమయంలో మహిళా పోలీసుల పట్ల ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన మార్గదర్శకాలు జారీ చేయాలని ఎంపీ కోరారు. చట్టాన్ని అమలు చేసే మహిళా సిబ్బందినే బెదిరించే లేదా అవమానించే పరిస్థితులు ప్రజాస్వామ్యంలో ఉండకూడదని స్పష్టం చేశారు.